# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website2:www.netinijam.com

ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ మంగళవారం 20-6-2023 RNI No.52865/93·Postal No.HQ/SD/258/2021-2023 సంపుటి :29 సంచిక: 242 పేజీలు:6 వెల: రూ.1/-


# మళ్లీ మనమే గెలుస్తాం.. అందులో డౌటే లేదు : సీఎం కేసీఆర్



రంగారెడ్డి, జూన్ 19: తెలంగాణలో మళ్లీ మనమే గెలుస్తాం.. అందులో డౌటే లేదని ముఖ్యమంత్రి కేసీఆర్ స్పష్టం చేశారు. అనేక విజయాలు సాధిస్తూ ఇంత దూరం వచ్చిన ఈ రాష్ట్రాన్ని మనం బ్రహ్మాండంగా ముందుకు తీసుకొని పోవాలి అని కేసీఆర్ ఆకాంక్షించారు. మహేశ్వరం నియోజకవర్గం పరిధిలోని తుమ్మలూరులో నిర్వహించిన 9వ విడత హరితహారం కార్యక్రమంలో కేసీఆర్ పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన సభలో కేసీఆర్ ప్రసంగించారు.

తెలంగాణ రాష్ట్రాన్ని మరింత బ్రహ్మాండంగా అభివృద్ధి చేసుకుందాం అని కేసీఆర్ పిలుపునిచ్చారు. అన్ని పనులు జరుగుతాయి. ఈ నియోజకవర్గానికి కృష్ణా నీళ్లు వస్తాయి. మహేశ్వరం దాకా మెట్రో రైలు ఆటోమేటిక్‌గా వస్తది. అటు బీహెచ్ఈఎల్.. ఇటు ఇక్కడి దాకా వస్తది. మళ్లీ మనమే గెలుస్తం.. అందులో డౌట్ లేదు. బ్రహ్మాండంగా మనమే ఉంటాం కాబట్టి.. ఒక పద్ధతిలో వచ్చే టర్మ్‌లో ఇవన్నీ సాధ్యం చేసుకుందామని మనవి చేస్తున్నాను అని కేసీఆర్ పేర్కొన్నారు.

### 20 వరకు ఫారెస్ట్ స్టేషన్లు ఏర్పాటు చేస్తాం..

ఫారెస్టు డిపార్ట్‌మెంట్ వారు చాలా కష్టపడి మన కోసం అడవులను పెంచుతున్నారు అని కేసీఆర్ తెలిపారు. కానీ దుర్మార్గులు ఒక ఫారెస్టు అధికారిని దారుణంగా చంపేశారు. ఆ ఫారెస్టు అధికారి భార్యకు డిప్యూటీ తహసీల్దార్‌గా ఉద్యోగం కల్పించి, నియామక పత్రాన్ని అందజేశాం. కొంత డబ్బులు కూడా సాయం చేశాం. మనిషిని అయితే తేలేం. కానీ వారికి ఉద్యోగం కూడా ఇవ్వడం జరిగింది. ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్‌కు హామీ ఇస్తున్నాను. మీ మీద దాడులు జరగకుండా ఉండేందుకు పోలీసు స్టేషన్ల మాదిరిగా ఫారెస్టు స్టేషన్లను ఏర్పాటు చేస్తాం. ఒక 20 వరకు స్టేషన్లు అవసరం అవుతాయన్నారు. వాటిని వెంటనే మంజూరు చేద్దాం. ఫారెస్టు డిపార్ట్‌మెంట్‌ను పటిష్టం చేద్దాం. తెలంగాణలో భారీగా ఫల వృక్షాలు పెంచాలి అని కేసీఆర్ సూచించారు.

### ఫల వృక్షాల పంపిణీకి రూ. 100 కోట్ల బడ్జెట్..!

హరితహారంలో అనేక అద్భుతాలు జరిగాయన్నారు కేసీఆర్. తెలంగాణలో.. ప్రతి గ్రామంలో నర్సరీ, పల్లె ప్రకృతి వనాలు ఏర్పాటు చేసుకున్నాం. అర్బన్ పార్కులు కూడా రూపుదిద్దుకున్నాయి. ఈ విజయం మనందరి విజయం. ప్రజలకు అవసరమైన పండ్ల మొక్కలను పంచేందుకు ఒక వంద కోట్ల బడ్జెట్ అయినా పెట్టి ఫల వృక్షాలను పంచాలని నిర్ణయించాం అని కేసీఆర్ తెలిపారు.

### అందరినీ ఆదుకుంటున్నాం..

రాష్ట్రంలో అన్ని వర్గాలను దృష్టిలో ఉంచుకుని సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాం అని కేసీఆర్ స్పష్టం చేశారు. దివ్యాంగులను మానవత్వంతో ఆదుకుంటున్నాం. వారికి పెన్షన్లు పెంచాం. ప్రతి ఒక్కరికి అవసరమయ్యే పథకాలు పెట్టుకున్నాం. కులానికో, మతానికో, జాతికో సంబంధించి పథకాలను అమలు చేయడం లేదు. ఏ ఒక్కరిని వదిలి పెట్టకుండా అందరినీ ఆదుకుంటున్నాం. తలసరి విద్యుత్ వినియోగంలో, తలసరి ఆదాయంలో, ధాన్యపు రాశులు పండించడంలో అలా అన్నింటిలో నంబర్ వన్‌గా ఉన్నాం అని కేసీఆర్ తెలిపారు.

## తమిళనాడులో దంచి కొడుతున్న భారీ వర్షాలు

చెన్నై జూన్ 19 (ఎక్స్ ప్రెస్ న్యూస్): తమిళనాడులో భారీవర్షాలు దంచి కొడుతున్నాయి. చెన్నైతో సహా పొరుగున ఉన్న జిల్లాల్లో రాత్రిపూట భారీ వర్షాలుకురుస్తున్నాయి. చెన్నై, తిరువళ్లూరు, కాంచీపురం, చెంగల్పట్టు, వెల్లూరు, రాణిపేట జిల్లాలను భారీవర్షాలు ముంచెత్తాయి. చెన్నైలోని పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. విమానాలు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పలు విమానాలను బెంగళూరుకు మళ్లించారు. చెన్నైనుంచి వెళ్లాల్సిన పలు విమానాలను రద్దు చేశారు. భారీ వర్షాలు కురుస్తుండటంతో రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలలకు సెలవు ప్రకటించింది. చెన్నైతో సహా ఆరు జిల్లాల్లో పాఠశాలలకు సోమవారం సెలవు ప్రకటించింది. మరోవైపు సోమవారం తమిళనాడులోని పలు ప్రాంతాల్లో తుఫాను ప్రభావం మరింత పెరిగే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. సోమవారం ఉదయం నుంచి ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురుస్తోంది. నిన్న రాత్రి చెన్నై అంతటా విస్తారంగా భారీ వర్షాలు నమోదయ్యాయి. మీనంబాక్కం ప్రాంతంలో గడిచిన 24 గంటల్లో 137.6 మి.మీ. వర్షపాతం నమోదైంది. సోమవారం కూడా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున చెన్నై సహా ఆరు జిల్లాల్లో పాఠశాలలకు రాష్ట్ర ప్రభుత్వం సెలవు ప్రకటించింది.


చెన్నైతో సహా పొరుగున ఉన్న జిల్లాల్లో రాత్రిపూట భారీ వర్షాలుకురుస్తున్నాయి. చెన్నై, తిరువళ్లూరు, కాంచీపురం, చెంగల్పట్టు, వెల్లూరు, రాణిపేట జిల్లాలను భారీవర్షాలు ముంచెత్తాయి. చెన్నైలోని పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. విమానాలు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పలు విమానాలను బెంగళూరుకు మళ్లించారు. చెన్నైనుంచి వెళ్లాల్సిన పలు విమానాలను రద్దు చేశారు. భారీ వర్షాలు కురుస్తుండటంతో రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలలకు సెలవు ప్రకటించింది. చెన్నైతో సహా ఆరు జిల్లాల్లో పాఠశాలలకు సోమవారం సెలవు ప్రకటించింది. మరోవైపు సోమవారం తమిళనాడులోని పలు ప్రాంతాల్లో తుఫాను ప్రభావం మరింత పెరిగే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. సోమవారం ఉదయం నుంచి ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురుస్తోంది. నిన్న రాత్రి చెన్నై అంతటా విస్తారంగా భారీ వర్షాలు నమోదయ్యాయి. మీనంబాక్కం ప్రాంతంలో గడిచిన 24 గంటల్లో 137.6 మి.మీ. వర్షపాతం నమోదైంది. సోమవారం కూడా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున చెన్నై సహా ఆరు జిల్లాల్లో పాఠశాలలకు రాష్ట్ర ప్రభుత్వం సెలవు ప్రకటించింది.


## ప్రపంచంలో అన్ని వసతులతో అభివృద్ధి చెందే అరుదైన ప్రదేశాల్లో తెలంగాణ ఒకటి: మంత్రి హరీశ్ రావు

హైదరాబాద్, జూన్ 19: అన్నిరకాల మౌలిక వసతులతో రాష్ట్రం అభివృద్ధి చెందుతున్నదని మంత్రి హరీశ్ రావు అన్నారు. ఇలా ప్రపంచంలో అన్ని వసతులతో అభివృద్ధి చెందే అరుదైన ప్రదేశాల్లో తెలంగాణ ఒకటని చెప్పారు. రాష్ట్రంలో గ్రీన్ కవర్ 7.7 శాతం వృద్ధి చెందిందని, ముఖ్యమంత్రి కేసీఆర్ దూరదృష్టితో ప్రవేశపెట్టిన హరితహారంతోనే ఇది సాధ్యమైందన్నారు. సీఎం కేసీఆర్ వంటి నిజమైన పర్యావరణవేత్త సమగ్ర, స్థిరమైన అభివృద్ధి గురించి ఆలోచిస్తారని వెల్లడించారు. ప్రతి ప్రభుత్వం ఏం చేయాలో ప్రపంచానికి తెలంగాణ సగర్వంగా చాటిచెప్పిందని తెలిపారు. తెలంగాణ ఆచరిస్తుంది, దేశం అనుసరిస్తుందని ట్వీట్ చేశారు.

హరితహారంలో భాగంగా రాష్ట్రంలో 14,864 నర్సరీలను, 19,472 పల్లె ప్రకృతి వనాలను ఏర్పాటుచేశామన్నారు. మొత్తం 13.44 లక్షల ఎకరాల్లో అడవులను పునరుద్ధరించామని, ఇప్పటివరకు 273 కోట్ల మొక్కలను నాటామన్నారు.

## దశాబ్దాల పాటు ధ్వంసమైన పర్యావరణానికి వరం.. తెలంగాణ హరితహారం : మంత్రి కేటీఆర్

హైదరాబాద్, జూన్ 19: తెలంగాణ తల్లి ఆకుపచ్చ చీర కట్టుకున్నట్టు.. భూమి తల్లికి పచ్చని రంగేసినట్టు.. ఇప్పుడు ఎక్కడ చూసినా పచ్చని చెట్లతో తెలంగాణ ప్రాంతం అలరారుతున్నది. దశాబ్దాలపాటు నిర్లక్ష్యానికి గురైన తెలంగాణ ప్రాంతం.. నేడు పచ్చని పంటలతో, మైదాన ప్రాంతం నిండుగా దట్టమైన చెట్లతో మూడమూచ్చటగా ఉన్నది. ఇదంతా ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న తెలంగాణకు హరితహారం కార్యక్రమం వల్లే సాధ్యమైంది.

తెలంగాణ రాష్ట్రావతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఇవాళ హరితహారం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ ట్వీట్ చేశారు. దశాబ్దాల పాటు ధ్వంసమైన పర్యావరణానికి వరం.. మహోద్యమంలో సాగుతున్న తెలంగాణ హరితహారం అని కేటీఆర్ పేర్కొన్నారు. తెలంగాణ పునర్నిర్మాణం అంటే.. ప్రజల బతుకుచిత్రాన్ని మార్చడమే కాదు.. ధ్వంసమైన అడవులను పునరుద్ధరించడం.. సకల జీవరాశులను సంరక్షించడం అని యావత్ దేశానికీ సగర్వంగా చాటిచెప్పిన దార్శనిక ముఖ్యమంత్రి కేసీఆర్‌ది అని పేర్కొన్నారు. గ్రేట్ వాల్ ఆఫ్ చైనాను తలదన్నేలా.. ఈ గ్రీన్ వాల్ ఆఫ్ తెలంగాణ నిర్మాణంలో.. భాగస్వాములైన ప్రకృతి ప్రేమికులందరికీ హృదయపూర్వక దశాబ్ది ఉత్సవాల శుభాకాంక్షలు అని పేర్కొంటూ కేటీఆర్ తన ట్వీట్ ముగించారు.

## రైతులకు శుభవార్త.. జూన్ 26 నుంచి రైతుబంధు నిధులు విడుదల

హైదరాబాద్, జూన్ 19: తెలంగాణ ప్రభుత్వం రైతులకు శుభవార్త వినిపించింది. ఈ నెల 26 నుంచి రైతు బంధు నిధులు విడుదల చేయాలని సర్కార్ నిర్ణయించింది. వానాకాలం పంట పెట్టుబడి కింద రైతుల ఖాతాల్లో నిధులు జమ కానున్నాయి. త్వరలో పోడు భూములకు పట్టాలు పంపిణీ చేయాలని సీఎం కేసీఆర్ నిర్ణయించారు. పట్టాల పంపిణీ అనంతరం పోడు రైతులకు కూడా రైతుబంధు సాయం అందించాలని అధికారులను ఆదేశించారు కేసీఆర్. ప్రభుత్వ ప్రకటనతో రైతులు హర్షం వ్యక్తం చేశారు.

### నేటి కందం- నేటికి అందం

నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం

కం॥ తలపాగకు చూపు - నూటా
నలుబది యారుగురు తెల్ల నరకాసురులన్
మెలి త్రిప్పి త్రోసివేయగ
కలకత్తా కృష్ణబిలము కసితో ప్రేంగెనో!!



-రాధశ్రీ

సెల్:9494481210

( జూన్ 20న బెంగాలు వారు 146 మంది ఆంగ్లేయ సైనికులను కృష్ణబిలంతో బంధించారు.

నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం

## రేపు బల్కంపేట ఎల్లమ్మ అమ్మవారి కల్యాణం..ఏర్పాట్లు పూర్తి : మంత్రి తలసాని



హైదరాబాద్, జూన్ 19: నగరంలోని బల్కంపేట ఎల్లమ్మ అమ్మవారి కల్యాణం మంగళవారం(20)న అంగరంగ వైభవంగా నిర్వహించనున్నామని, అందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయని రాష్ట్ర పశు సంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ వెల్లడించారు. సోమవారం అమ్మవారి కల్యాణం ఏర్పాట్లను ఆయన పరిశీలించి అధికారులకు, నిర్వాహకులకు పలు సూచనలు చేశారు.

అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఎల్లమ్మ అమ్మవారి కల్యాణం రోజున అమ్మవారిని దర్శించుకుంటే శుభం జరుగుతుందని భక్తుల విశ్వాసమని తెలిపారు. ఆలయానికి వివిధ ప్రాంతాలు, రాష్ట్రాల నుంచి లక్షలాదిగా వచ్చే భక్తులుఎలాంటి అసౌకర్యానికి గురికాకుండా ఏర్పాట్లు చేశామని అన్నారు. ఆలయ నిర్వాహకులు, భక్తులు ,అన్ని శాఖల సమన్వయంతో ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు.

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత బల్కంపేట ఆలయం ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుకు ముందు ఆలయానికి రూ. 4కోట్ల ఆదాయం రాగా నేడు రూ. 22 కోట్ల ఆదాయం వస్తుందన్నారు. తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రంలోని అన్ని దేవాలయాలను అభివృద్ధి చేస్తుందని పేర్కొన్నారు. యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని అద్భుతంగా తీర్చిదిద్దారని , వేములవాడ, బాసర, భద్రాద్రి ఆలయాలు కూడా అభివృద్ధి చెందుతున్నాయని తెలిపారు.

## అన్ని రాజకీయ పార్టీలు బీసీ డిక్లరేషన్ ప్రకటించాలి

హైదరాబాద్ జూన్ 19 (ఎక్స్ ప్రెస్ న్యూస్) . వచ్చే అసెంబ్లీ,పార్లమెంటు ఎన్నికలలో అన్ని రాజకీయ పార్టీలు బిసి డిక్లరేషన్ ను ప్రకటించి జనాభా దామాషా ప్రకారం అసెంబ్లీ పార్లమెంటు స్థానాలు కేటాయించాలని బీసీ సేన రాష్ట్ర అధ్యక్షులు బూరుగుపల్లి కృష్ణ యాదవ్ డిమాండ్ చేశారు. సోమవారం బిసి భవన్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశానికి స్వతంత్రం సిద్ధించి 76 సంవత్సరాలు పూర్తయిన ప్రజాస్వామ్య దేశంలో మెజార్టీ ప్రజలైన బీసీలకు జనాభా దామాషా ప్రకారం రాజ్యాంగ పాలాలు అందకపోవడం పాలకుల నిర్లక్ష్యానికి నిదర్శనమని ఆయన విమర్శించరు. బిసిలంటే జండాలు మోసే కులీలా అని ఆయన ప్రశ్నించారు. బీసీలను రాజకీయంగా వాడుకునే పార్టీలకు వచ్చే ఎన్నికలలో చరమగీతం పాడాలని బీసీ శ్రే నులకు కృష్ణ యాదవ్ పిలుపు నిచ్చారు. బీసీ కులవృత్తిదారులకు ఆధునాతనమైన నైపుణ్యత శిక్షణను ఇప్పించి 100% రాయితీ రుణాలు అందించి ఉపాధి కల్పించాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు . క్షౌర్తి దారులకు లక్ష రూపాయల పథకం ప్రవేశపెట్టిన రాష్ట్ర ప్రభుత్వం దరఖాసుదారులు దరఖాస్తు చేసుకోవడానికి ఆరు నెలల సమయం కేటాయించాలని కోరారు. ఈ సమావేశం లో రాష్ట్ర కార్యదర్శి, అరవిందస్వామి, వెంకటేష్, ప్రశాంత్, గణేష్, శివ తదితరులు పాల్గొన్నారు.

## హరితోత్సవం.. ఉప్పల్ భగాయత్‌లో మొక్కలు నాటిన ఎంపీ సంతోష్ కుమార్



హైదరాబాద్, జూన్ 19: తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా నేడు రాష్ట్ర వ్యాప్తంగా హరితోత్సవం నిర్వహిస్తున్నారు.

ఇందులో భాగంగా రాజ్యసభ సభ్యులు సంతోష్ కుమార్ మేడ్చల్ జిల్లాలోని ఉప్పల్ భగాయత్‌లోని హెచ్ఎండీఏ లేఔట్‌లో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి, పార్టీ నాయకులు, అధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మొక్కలు నాటిన ప్రతిఒక్కరిని ఎంపీ సంతోష్ అభినందించారు.

హరితహారం కార్యక్రమాన్ని స్ఫూర్తిగా తీసుకుని గ్రీన్ ఇండియా చాలెంజ్ కార్యక్రమాన్ని ప్రారంభించామని చెప్పారు. తొమ్మిదేండ్లలో హరితహారం, గ్రీన్ ఇండియా చాలెంజ్ ద్వారా ప్రజల్లో పచ్చదనంపై చైతన్యం తీసుకొచ్చామన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడంతో ఎంతో పచ్చదనం పెరిందని వెల్లడించారు.

## భద్రకాళీ శాకాంబరి నవరాత్రోత్సవాలు ప్రారంభం

వరంగల్, జూన్ 19:చారిత్రక భద్రకాళీ ఆలయంలో శాకాంబరి నవరాత్రులు వైభవంగా ప్రారంభమయ్యాయి. సోమవారం ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్యలు జ్యోతి ప్రజ్వలన చేసి ఉత్సవాలను ప్రారంభించారు. తొలిరోజు కామేశ్వరి అలంకరణలో భద్రకాళీ అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. నవరాత్రి ఉత్సవాలకు ప్రజలు పెద్ద ఎత్తున విచ్చేసి అమ్మవారి ఆశీస్సులు పొందాలని వారు కోరారు. కార్యక్రమంలో కొమురవెల్లి దేవస్థాన ఆస్థాన వేదపడింతులు వేలేటి సిద్ధరామశర్మ, ఆలయ సామవేద పండితులు ప్రదీప్‌కుమార్ శర్మ, ముఖ్య అర్చకులు నర్సింహశర్మ, వెంకట నాగరాజశర్మ, ఆలయ సూపరింటెండెంట్ అద్దంకి విజయ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రొఫెసర్ జయశంకర్ సాహిత్య పురస్కారానికి డాక్టర్ ఎన్ గోపి ఎంపిక



హైదరాబాద్, జూన్ 19: ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ విశిష్ట సాహితీ పురస్కారానికి ఆచార్య ఎన్ గోపి ఎంపికయ్యారు. సాహిత్యంలో అత్యున్నత శిఖరాలను అధిరోహించిన సాహితీ మూర్తులకు భారత జాగృతి ఈ అవార్డు ఇవ్వనుంది. అవార్డును ఈ సంవత్సరం ప్రారంభించగా తొలి అవార్డును ఎన్ గోపి అందుకోనుండడం విశేషం.

గోపి ఇప్పటికీ 56 పుస్తకాలు రచించగా అందులో 26 కవితా సంకలనాలు, 7 వ్యాస సంకలనాలు, 5 అనువాదాలు కాగా మిగతావి ఇతరాలు ఉన్నాయి. వారి రచనలు అన్ని భారతీయ భాషలలోకి అనువాదం అవడంతో పాటు జర్మన్, పర్షియన్, రష్యన్ వంటి భాషల్లోకి అనువాదం అయ్యాయి. వీరు తెలుగు యూనివర్సిటీకి వీసీగా వ్యవహరించడంతో పాటు కాకతీయ, ద్రవిడ యూనివర్సిటీలకు ఇంఛార్జి వీసీగా సేవలందించారు. జూన్ 21న ఉదయం అబిడ్స్‌లోని తెలంగాణ సారస్వత పరిషత్తులో జరిగే కార్యక్రమంలో భారత జాగృతి అధ్యక్షులు కల్వకుంట్ల కవిత, ఇతర పెద్దల చేతుల మీదుగా అవార్డు ప్రదానం చేయనున్నారు.

## అధిక ఉష్ణోగ్రతతో ఉత్తరప్రదేశ్‌లోని 54 మంది మృతి



లక్నోజూన్ 19 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: పెరిగిన అధిక ఉష్ణోగ్రతల మధ్య ఉత్తరప్రదేశ్‌లోని బల్లియా జిల్లాలో 3 రోజుల వ్యవధిలో 54 మంది ప్రాణాలు కోల్పోగా.. 400 మంది ఆసుపత్రుల పాలయ్యారు. జూన్ 15న 23 మంది చనిపోగా.. 16న 20 మంది, 17న 11 మంది చనిపోయారు. అయితే ఈ మరణాలకు గల కారణాలపై అధికారులు భిన్న వివరణలు ఇచ్చారు. మొదటగా తూర్పు ఉత్తరపరదేశ్ జిల్లాలోని ప్రభుత్వ వైద్యులు ఈ మరణాలకు అధిక ఉష్ణోగ్రతలే కారణమై ఉండొచ్చని చెప్పారు. అయితే ఈ మరణాలకు కారణాలు తెలుసుకోవడానికి ఏర్పాటు చేసిన విచారణ కమిటీ ఇన్‌చార్జ్, లక్నోకు చెందిన సీనియర్ ప్రభుత్వ వైద్యుడు ఏకే సింగ్.. మరణాలకు అధిక ఉష్ణోగ్రతలే కారణమనే విషయాన్ని తోసిపుచ్చారు.

ఏకే సింగ్ మాట్లాడుతూ “ ప్రాథమికంగా ఇవి అధిక ఉష్ణోగ్రతల వల్ల సంభవించిన మరణాలుగా కనిపించడం లేదు. ఎందుకంటే ఇలాంటి పరిస్థితులే బల్లియా సమీప జిల్లాలోనూ ఉన్నాయి. కానీ అక్కడ ఇలాంటి మరణాలు నమోదు కాలేదు. చనిపోయిన వారిలో ఎక్కువ మందికి మొదట ఛాతిలో నొప్పి వచ్చింది. కానీ అధిక ఉష్ణోగ్రతల వల్ల ప్రభావితమైన వారిలో ఛాతిలో నొప్పి రావడం మొదటి లక్షణం కాదు. అయితే ఈ మరణాలు నీటి వల్ల ఏమైనా సంభవించాయా లేదా ఇంకేమైనా కారణం ఉందా అనేది తేలడానికి దర్యాప్తు చేస్తాం. వాతావరణ విభాగం కూడా నీటి నమూనాలను తనిఖీ చేయడానికి వస్తోంది” అని ఆయన చెప్పారు.

అంతకుముందు రోజు బల్లియా చీఫ్ మెడికల్ సూపరింటెండెంట్ ర్యాంక్ వైద్యుడు చాలా మరణాలు వడదెబ్బ కారణంగానే సంభవించాయని ప్రకటించాడు. దీంతో ఆ ప్రకటన వైరల్‌గా మారింది. అయితే సరైన సమాచారం లేకుండా అధిక ఉష్ణోగ్రతల వల్ల సంభవించే మరణాలపై నిర్లక్ష్యంగా ప్రకటన చేసినందుకు సదరు వైద్యుడిని విధుల నుంచి తొలగించినట్లు యూపీ ఆరోగ్య మంత్రి బ్రజేష్ పాఠక్ తెలిపారు. అంతేకాకుండా బల్లియాలో జరిగిన ఘటనను ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుందని, అక్కడి పరిస్థితిని తాను స్వయంగా పర్యవేక్షిస్తున్నానని బ్రజేష్ పాఠక్ చెప్పారు.

అయితే ఈ మరణాలకు రాష్ట్ర ప్రభుత్వమే కారణమని ఉత్తర ప్రదేశ్ ప్రతిపక్ష నాయకుడు, సమాజ్‌వాద్ పార్టీ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. “ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా రాష్ట్ర వ్యాప్తంగా చాలా మంది ప్రాణాలు కోల్పోయారు. అధిక ఉష్ణోగ్రతల గురించి ప్రభుత్వం ముందుగానే ప్రజలను హెచ్చరించాలి. గత 6 సంవత్సరాల్లో యూపీలో ఒక ప్రభుత్వ ఆసుపత్రి కూడా నిర్మించలేదు. చనిపోయిన వారిలో ఎక్కువ మంది పేద రైతులే ఉన్నారు. ఎందుకంటే వారికి సరైన సమయంలో ఆహారం, మందులు, వైద్యం అందలేదు.” అని అఖిలేష్ యాదవ్ అన్నారు.

ప్రస్తుతం బల్లియా జిల్లాలో రోగుల తాకిడి ఎక్కువగా ఉండడంతో అందరికీ స్ట్రెచర్లు కూడా దొరకడం లేదు. చాలా మంది అటెండర్లు రోగులను తమ భుజాలపై మోసుకుంటూ అత్యవసర వార్డులకు తీసుకెళ్తున్నారు.

## నేడు తెలంగాణ విద్యాదినోత్సవం.. విద్యార్థులకు పోటీలు..!

హైదరాబాద్, జూన్ 19: తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా విద్యాదినోత్సవం విజయోత్సవాలు నిర్వహించనున్నారు. ఆయా కార్యక్రమాల్లో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, స్థానిక ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొనున్నారు. పాఠశాలల నుంచి విశ్వవిద్యాలయం, అన్ని గురుకుల పాఠశాలలు, వైద్య, ఇంజినీరింగ్, పాలిటెక్నిక్, ఐటీఐ, ఫారెస్ట్, అగ్రికల్చర్, హార్టికల్చర్, వెటర్నరీ, ఫిషరీస్ తదితర అన్ని విద్యాసంస్థల్లో విద్యాదినోత్సవం వేడుకలు జరుగనున్నాయి. గత తొమ్మిదేళ్లలో విద్యారంగంలో రాష్ట్రం సాధించిన విజయాలను తెలియజేయనున్నారు.

‘మన ఊరు – మనబడిలో భాగంగా పలు పాఠశాలలను అభివృద్ధి చేసిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా వాటికి ప్రారంభోత్సవం చేయనున్నారు. దాంతో పాటు 10వేల గ్రంథాలయాలు, 1600 డిజిటల్ క్లాస్ రూమ్స్‌ను ప్రారంభించనున్నారు. పాఠశాలల్లో విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం, పాటల పోటీలు నిర్వహించనున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మామిడితోరణాలు, పూలతో అందంగా అలంకరించి విజయోత్సవాలను ఘనంగా జరుపనున్నారు. నిర్వహిస్తారు.

విద్యారంగంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన ‘మన ఊరు – మన బడి కార్యక్రమం’తో పాటు 1001 గురుకులాలు, హార్టీకల్చర్, ఫారెస్ట్, మహిళ, హెల్త్ యూనివర్సిటీ, జిల్లాకో మెడికల్ కాలేజీకి, నర్సింగ్, పారామెడికల్ కాలేజీలు, జూనియర్–డిగ్రీ కాలేజీల (రెసిడెన్షియల్ సహా)పై వివరించనున్నారు. విద్యా దినోత్సవం సందర్భంగా అన్ని గ్రామాల్లో విద్యార్థులు ర్యాలీలు తీయనున్నారు. ఆ రోజున పాఠశాలల్లో జాతీయ జెండాను ఎగురవేసి, తొమ్మిదేళ్ల విద్యారంగంలో పాఠశాల ప్రగతి, విద్యారంగంలో సాధించిన విజయాలు, పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాల పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తారు. పాఠశాలల్లో యూనిఫారాలు, ట్యాబ్‌లు, డిజిటల్ క్లాస్ రూమ్‌ల ప్రారంభోత్సవం, అనుబంధ పోషకాహారం కార్యక్రమాలు ఉంటాయి. రాష్ట్రంలోని డిగ్రీ, జూనియర్ కళాశాలల్లో, సాంస్కృతిక కార్యక్రమాలు, బోధనా సిబ్బంది, బోధనేతర సిబ్బందికి సన్మానించనున్నారు.

## బాసర ఆర్జీయూకేటీ ప్రవేశ దరఖాస్తు గడువు 22 వరకు పొడిగింపు

నిర్మల్ జూన్ 19 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: బాసర ఆర్జీయూకేటీ ప్రవేశ దరఖాస్తు గడువు పొడగిస్తున్నట్లు డైరెక్టర్ సతీష్‌కుమార్ ప్రకటించారు. జూన్ 19తో దరఖాస్తుల స్వీకరణ గడువు ముగిసింది. అయితే విద్యార్థుల అభ్యర్థనల మేరకు ఈనెల 22 వరకు దరఖాస్తు స్వీకరణ గడువు పొడిగిస్తున్నట్లు సతీష్‌కుమార్ తెలిపారు. దీంతో అర్హులైన మరికొందరు విద్యార్థులు దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించారు. అలాగే దివ్యాంగులు, సీఏపీ, ఎన్‌సీసీ, స్పోర్ట్స్ కోటా అభ్యర్థులు ఈ నెల 27 వరకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశమిచ్చారు. ఆరేళ్ల కోర్సుల్లో ప్రవేశాలకు ఎంపికైన అభ్యర్థుల ప్రాథమిక జాబితాను జులై 3న విడుదల చేసే అవకాశం ఉందని వర్సిటీ అధికారులు చెబుతున్నారు.

# కన్నీళ్లను చెమటగా మార్చగల ధన్యజీవి నాన్న

## (19 జూన్ 'ప్రపంచ పితృ దినోత్సవం' సందర్భంగా)

కుటుంబ వృక్షానికి కనిపించే కాండం అమ్మ అయితే కనిపించని తల్లి వేరు నాన్న. కుటుంబాభివృద్ధి యంత్రానికి ఇం'ధనం' నాన్న. సంతానాభివృద్ధికి మార్గదర్శే కాదు విలక్షణ కథానాయకుడు కూడా నాన్నే. కుటుంబ గౌరవ జ్యోతి ప్రజ్వలకర్త నాన్న. పుస్తకజ్ఞానం లేకపోయినా లోకరీతిని చదివిన మేధావి నాన్న. తన భుజాలు వంశ భారాన్ని మోసే వాహనాలు. కుటుంబ దేహానికి నాన్నే వెన్నెముక. అమ్మతో కలిసి అమృతాన్ని వితరణ చేసే పితృదేవులు నాన్న. నాన్న ఓ ఆత్మీయ నేస్తం, అవసరాల్ని తీర్చే హస్తం. దారితప్పిన పిల్లల్ని సన్మార్గంలో పెట్టి, వారి మనసులో ప్రతినాయకుడైయ్యేది నాన్నే.

### కుటుంబ రక్షణ కవచం:

తన జీవితం కుటుంబానికే రక్షణ కవచం. తండ్రి త్యాగం అనన్య సామాన్యం. పిల్లల కంటికి రెప్ప పిత. బోధనలో గురువు, సాధనలో అనంత శక్తిమంతుడు. నాన్న చెమటే ఇంటి దీపపు చమురు. తడబడినపుడు తనో ఊతకర్ర, బెదిరినపుడు తనో కొండంత ధైర్యం. సన్మార్గ సందేశమే ఆయన అభిమతం. తండ్రి మనసు దూదంత మెత్తన, పాల నురగంత తెల్లన, వెన్నెలంత చల్లన. కుటుంబ లతకు పందిరి నాన్న. ఎదిగే సంతాన మె?క్కలకు తనో ట్రీగార్డు. నాన్న శ్వాస కుటుంబ సంక్షేమం. కుటుంబ కాయానికి ప్రాణవాయువు, గాయానికి లేపనం నాన్న. తను కరుగుతూ వెలుగులు చిమ్మే కొవ్వొత్తి నాన్న. నాన్న బతుకు కష్టాలమయం, కుటుంబహితం. ప్రేమల ఊట బాయి, అనురాగాల అక్షయపాత్ర నాన్న. తనువు అలిసి సొలిసినా కుటుంబ నవ్వులతో శక్తిని పుంజుకొని బేషరతుగా సర్వస్వం దారబోసే నాన్న జీవితం మహోన్నత ఆదర్శ దీపస్తంభం. పిల్లల పెంపకంలో తనో పరిపాలనాదక్షుడు, అవసరమైతే ఆయనే చంఢశాసనుడు.

### త్యాగానికి నిలువెత్తు సాక్షం:

అమ్మ జన్మనిస్తే, నాన్న జీవితపరమార్థాన్ని ప్రసాదిస్తాడు. అమ్మ తొలి అడుగు వేయిస్తే, నాన్న ప్రగతి పథం చూపుతాడు. అమ్మ తొలి పలుకు నేర్పితే, నాన్న జీవిత పాఠాల సుభాషితాలు నూరి పోస్తాడు. నాన్న లేనిదే సంతానం లేదు. కుటుంబ పోషణకే తన జీవితం అంకితం. అమ్మనాన్నల అన్యోన్యతే పిల్లల సుఖసంతోషాల కోవెల. ఆది గురువు అమ్మ అయితే లోకజ్ఞాన బోధకుడు నాన్న. మన జీవితాల్లో నాన్న స్థానం భర్తీ చేయలేని అద్వితీయ, నిరుపమాన పాత్ర. కొడుకులకు తనో దారి దీపం. కూతురుకు నాన్నంటేనే పంచప్రాణం. నాన్న లేని ఇల్లు గాఢాంధకారం. చీకట్లను పారద్రోలే రవి కిరణమే నాన్న. కుటుంబ పుస్తకంలో నాన్నే భావాక్షరం. జీవితాక్షరాలకు నాన్నేగా అర్థాలు బోధపరిచే జ్ఞానం. నాన్న పాత్రకు ప్రత్యామ్నాయం లేదు. తండ్రి త్యాగానికి తత్సమానం లేదు. తండ్రి మది సమస్యల సుడిగుండం. తండ్రి కంటికి కునుకు కరువు. తండ్రి తపన హిమవత్పర్వతం. పురుషుడి జన్మకు సంపూర్ణార్థం నాన్న అవడమే. పిల్లల రెక్కలకు ఎగరడం నేర్పే నైపుణ్య జీవి నాన్న. నవ్వుల పరదాల వెనక బాధలను కప్పేసి, కన్నీళ్లను చెమటగా మార్చి తనవారిని గుండెల్లో పెట్టుకొని సాదుకునే నాన్న హృదయం ఎవరెస్టంత ఉన్నతం, సాగరమంత వైశాల్యం. త్యాగానికి నిలువెత్తు సాక్ష్యం తండ్రి.

### కన్నీళ్లను దిగమింగి చెమటగా మార్చగల ధన్యజీవి:

నాన్న ప్రాధాన్యతను గుర్తించిన అంతర్జాతీయ సమాజం ప్రతి ఏటా జూన్ 3వ ఆదివారం, అనగా 19 జూన్‌న 'ప్రపంచ పితృ దినోత్సవం' నిర్వహించుట జరుగుతుంది. మన హిందూ సమాజంలో కుటుంబ వ్యవస్థ పటిష్టంగా ఉండడంతో అమ్మనాన్నల నేతృత్వంలోనే కుటుంబ ప్రగతి రథం కదులుతుంది. కుటుంబ బండికి రెండు చక్రాలుగా అమ్మానాన్నలు నాయకత్వం వహిస్తారు. పిల్లల బతుకు పయనం ఈ బండిలోనే మె?దలవుతుంది. మన సంప్రదాయంలో అనునిత్యం పితృదినోత్సవమే. పాశ్చాత్య దేశాల్లో మాత్రం యవ్వనం ప్రవేశించగానే రెక్కలొచ్చిన బిడ్డలు గూటి నుంచి నిష్క్రమించి స్వతంత్రంగా జీవించడం ప్రారంభిస్తారు. అలాంటి సంస్కృతిలో తండ్రితో కొన్ని క్షణాలు గడపడానికి పితృ దినోత్సవం అనే వేదిక వారికి ఉపయోగపడుతుంది. నేటి భారతీయ యువత ఆధునిక పోకడల పేరుతో అమ్మనాన్నలను ఆదరించకుండా నిర్లక్ష్యం చేస్తూ అనాథలుగా మార్చడం అమానవీయం, ఆక్షేపణీయం. పితృ దినోత్సవం వేదికగా నాన్నకు కృతజ్ఞతలను తెలపడం, పుష్పగుచ్ఛాలను అందించడం, మధుర క్షణాలను సంతోషంగా గడపడం, కానుకలు సమర్పించడం, నాన్న దీవెనలు పొందడం జరుగుతుంది. బాధ్యతల వలలో చిక్కినా, నిబ్బరంగా కనిపిస్తూ, సవాళ్ళను అధిగమిస్తూ, కన్నీళ్లను దిగమింగుతూ, రక్తాన్ని చెమటగా మార్చగల ధన్యజీవి నాన్న.

### అమ్మనాన్న దీవెనలే దైవాశీస్సులు:

నాన్న రుణం తీర్చుకోలేనిది. నాన్న అయిన తరువాతే పురుషుడికి నాన్న హృదయం ఆవిష్కృతం అవుతుంది. వృద్ధాప్యంలో నాన్న సంతోషానికి కారణం పిల్లల ఉన్నతి. వృద్ధాప్యంలో నాన్నకు మనందరం కృతజ్ఞతాపూర్వకంగా ఊతకర్రలం అవుదాం. తన రుణాన్ని తీర్చుకునే అవకాశాల్ని నిరంతరం చేజిక్కించుతుందాం. మన ముందు కదిలే దేవతలుగా అమ్మనాన్నలను ఆరాదిద్దాం. నాన్న సంతోషానికి కారణమవుతూ, దీవెనలు పొందుతూ, సదా కృతజ్ఞతలు తెలుపుతూ ఉందాం. నాన్నే హీరో, తను లేని జీవితం జీరో. అమ్మనాన్నలు నిర్మించిన హద్దులు లేని ప్రేమ సామ్రాజ్యంలో స్వేచ్ఛగా, బాధ్యతగా ఎగరడం నేర్చుకుందాం, వారి దీవెనలతో శక్తి నింపుకుందాం. తల్లితండ్రులకు పాదాభివందనాలు సమర్పిద్దాం.



- డా।। బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

# 2023-24 ఆర్థిక సంవత్సరానికి 12.73% వృద్ధిని నమోదు చేసిన స్థూల ప్రత్యక్ష పన్ను వసూళ్లు

న్యూఢిల్లీ, జూన్ 19:ఈ 2023-24 ఆర్థిక సంవత్సరంలో ప్రత్యక్ష పన్నుల వసూళ్లు గొప్ప వృద్ధిని నమోదు చేసాయి. 2023 జూన్ 17వ తేదీకి నికర పన్నుల సేకరణ రూ.3,79,760 కోట్ల రూపాయలుగా నమోదయింది. గత ఏడాది ఈ సేకరణ రూ. 3,41,568 కోట్లతో పోలిస్తే ఈ ఏడాది నికర పన్ను సేకరణ 11.18 శాతం పెరిగింది.

నికర ప్రత్యక్ష పన్ను వసూళ్లు రూ. 3,79,760 కోట్లు (17.06.2023 నాటికి)లో కార్పొరేషన్ పన్ను (సీఐటి) రూ. 1,56,949 కోట్లు (నికర రిఫండ్), వ్యక్తిగత ఆదాయపు పన్ను (పిఐటి) సెక్యూరిటీస్ ట్రాన్సాక్షన్ టాక్స్ (ఎస్టిటి)తో సహా రూ. 2,22,196 కోట్లు (నికర రిఫండ్) ఉన్నాయి.

2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ప్రత్యక్ష పన్నుల స్థూల సేకరణ (రిఫండ్స్ కోసం సర్దుబాటు చేయడానికి ముందు) రూ. 4,19,338 కోట్లు ఉంటే, ఇది 2022-23 ఆర్థిక సంవత్సరపు వసూళ్ల కంటే 12.73% వృద్ధిని నమోదు చేసింది. అంటే మునుపటి ఆర్థిక సంవత్సరం సంబంధిత కాలంలో ఈ పన్ను సేకరణ రూ. 3,71,982 కోట్లు ఉంది. స్థూల పన్ను సేకరణ రూ. 4,19,338 కోట్లలో కార్పొరేషన్ పన్ను (సిఐటి) రూ. 1,87,311 కోట్లు, సెక్యూరిటీస్ ట్రాన్సాక్షన్ టాక్స్ (ఎస్టిటి)తో సహా వ్యక్తిగత ఆదాయపు పన్ను (పిఐటి) రూ. 2,31,391 కోట్లు. మైనర్ హెడ్ వారీగా వసూలు చేయడంలో అడ్వాన్స్ ట్యాక్స్ రూ. 1,16,776 కోట్లు; మూలం వద్ద మినహాయించిన పన్ను రూ. 2,71,849 కోట్లు; సెల్ఫ్-అసెస్‌మెంట్ పన్ను రూ. 18,128 కోట్లు; రెగ్యులర్ అసెస్‌మెంట్ ట్యాక్స్ రూ. 9,977 కోట్లు; ఇతర మైనర్ హెడ్స్ కింద పన్ను రూ. 2,607 కోట్లు నమోదయ్యింది.

2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మొదటి త్రైమాసికానికి ముందస్తు పన్ను వసూళ్లు 17.06.2023 నాటికి రూ. 1,16,776 కోట్లు నమోదయింది. తక్షణమే ముందున్న ఆర్థిక సంవత్సరం అంటే 2022-23 సంబంధిత కాలానికి ముందస్తు పన్ను వసూళ్లు రూ. 13.70% వృద్ధిని చూపుతూ, 1,02,707 కోట్లు నమోదయింది. ముందస్తు పన్ను వసూళ్లు 17.06.2023 నాటికి రూ. 1,16,776 కోట్లు అయితే దీనిలో కార్పొరేషన్ పన్ను (సిఐటి) రూ. 92,784 కోట్లు, వ్యక్తిగత ఆదాయపు పన్ను (పిఐ టి) రూ. 23,991 కోట్లు కలిపి ఉంది.

రిఫండ్ మొత్తం 2023-24 ఆర్థిక సంవత్సరంలో 17.06.2023 వరకు రూ.39,578 కోట్లు చెల్లించడం జరిగింది. మునుపటి ఆర్థిక సంవత్సరంలో 2022-23లో 30.13% వృద్ధిని చూపుతూ సంబంధిత కాలంలో రూ.30,414 కోట్లు రిఫండ్స్ జమ చేయడం జరిగింది.

# 2021 సంవత్సరానికిగాను గోరఖ్‌పూర్‌లోని గీతా ప్రెస్‌కు గాంధీ శాంతి బహుమతి

న్యూఢిల్లీ, జూన్ 19:గాంధీ పీస్ ప్రైజ్ అనేది మహాత్మా గాంధీ 125వ జయంతి సందర్భంగా 1995లో భారత ప్రభుత్వం ఏర్పాటు చేసిన వార్షిక పురస్కారం. ఈ అవార్డు జాతీయత, జాతి, భాష, కులం, మతం లేదా లింగంతో సంబంధం లేకుండా అందరికీ అందుబాటులో ఉంటుంది.

ఈ అవార్డు కింద రూ. 1 కోటి నగదుతో పాటు ఒక ప్రశంసా పత్రం, ఒక ఫలకం మరియు ఒక అద్భుతమైన సాంప్రదాయ హస్తకళ/చేనేత వస్తువును అందిస్తారు.

గత అవార్డు గ్రహీతలలో ఇస్రో, రామకృష్ణ మిషన్, గ్రామీణ బ్యాంక్ ఆఫ్ బంగ్లాదేశ్, వివేకానంద కేంద్రం, కన్యాకుమారి, అక్షయ పాత్ర, బెంగళూరు, ఏకల్ అభియాన్ ట్రస్ట్, ఇండియా మరియు సులభ్ ఇంటర్నేషనల్, న్యూఢిల్లీ వంటి సంస్థలు ఉన్నాయి.

అలాగే ఈ అవార్డు దక్షిణాఫ్రికా మాజీ అధ్యక్షుడు దివంగత డాక్టర్ నెల్సన్ మండేలా, టాంజానియా మాజీ అధ్యక్షుడు డాక్టర్ జూలియస్ నైరెరే, డాక్టర్ ఎ.టి. అరియరత్నే, శ్రీలంక సర్వోదయ శ్రమదన వ్యవస్థాపక అధ్యక్షుడు, ఫెడరల్ రిపబ్లిక్ ఆఫ్ జర్మనీ, డాక్టర్ గెర్హార్డ్ ఫిషర్, బాబా ఆమ్టే, డాక్టర్ జాన్ హ్యూమ్, ఐర్లాండ్, శ్రీ వాక్లావ్ హావెల్, చెకోస్లోవేకియా మాజీ అధ్యక్షుడు, దక్షిణాఫ్రికా ఆర్చ్ బిషప్ డెస్మండ్ టుటు, శ్రీ. చండీ ప్రసాద్ భట్ మరియు జపాన్‌కు చెందిన శ్రీ యోహెయ్ ససకవాకు అందించబడింది.

ఇటీవలి అవార్డు గ్రహీతలలో సుల్తాన్ ఖబూస్ బిన్ సైద్ అల్ సైద్, ఒమన్ (2019) మరియు బంగ్లాదేశ్‌లోని బంగబంధు షేక్ ముజిబుర్ రెహమాన్ (2020) ఉన్నారు.

గౌరవప్రదమైన ప్రధానమంత్రి నేతృత్వంలోని జ్యూరీ, 18 జూన్, 2023న చర్చల అనంతరం అహింసా మరియు ఇతర గాంధేయ పద్ధతుల ద్వారా సామాజిక, రాజకీయ పరివర్తన, ఆర్థిక రంగాలలో చేసిన విశేష కృషికి గుర్తింపుగా 2021 సంవత్సరానికి గాంధీ శాంతి బహుమతి గ్రహీతగా గీతా ప్రెస్, గోరఖ్‌పూర్‌ను ఎంపిక చేయాలని ఏకగ్రీవంగా నిర్ణయించింది.

1923లో స్థాపించబడిన గీతా ప్రెస్ 16.21 కోట్ల శ్రీమద్ భగవద్గీతతో సహా 14 భాషల్లో 41.7 కోట్ల పుస్తకాలను ప్రచురించిన ప్రపంచంలోని అతిపెద్ద ప్రచురణకర్తలలో ఒకటి. సంస్థ ఆదాయ ఉత్పత్తి కోసం దాని ప్రచురణలలోని ప్రకటనలపై ఎన్నడూ ఆధారపడలేదు. గీతా ప్రెస్ దాని అనుబంధ సంస్థలతో పాటు అందరి శ్రేయస్సు కోసం కృషి చేస్తుంది.

శాంతి మరియు సామాజిక సామరస్యానికి సంబంధించిన గాంధేయ ఆదర్శాలను ప్రచారం చేయడంలో గీతా ప్రెస్ అందించిన సహకారాన్ని ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ గుర్తు చేసుకున్నారు. గీతా ప్రెస్ స్థాపించి వందేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా గాంధీ శాంతి బహుమతి ప్రదానం చేయడం సమాజ సేవలో సంస్థ చేస్తున్న కృషికి గుర్తింపుగా ఆయన తెలిపారు.

గాంధీ శాంతి బహుమతి 2021, మానవాళి యొక్క సామూహిక అభ్యున్నతికి తోడ్పడడంలో గీతా ప్రెస్ యొక్క ముఖ్యమైన మరియు అనవమానమైన సహకారాన్ని గుర్తిస్తుంది.

ఇది నిజమైన అర్థంలో గాంధేయ జీవితాన్ని వ్యక్తీకరిస్తుంది.

# సాయంత్రమైతే చాలు జగన్ పబ్జీ ఆడుకుంటారు.. చంద్రబాబు యెద్దేవా

అమరావతి జూన్ 19 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డిపై టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ..."తండ్రిని చంపిన కేసులో శిక్ష పడిన కొడుకు తండ్రి లేని బిడ్డని క్షమాభిక్ష పెట్టండని కోరాడట. జగన్ తీరు శిక్ష పడిన కొడుకులాగే ఉంది" అంటూ వ్యాఖ్యలు చేశారు. తల్లి లేదు.. చెల్లి లేదు.. బాబాయ్ లేడు.. బీజేపీ కూడా లేదంటూ ఏదేదో కామెంట్లు చేస్తున్నారన్నారు. "నేను ముసలివాడినా..? జగనుకు నాకున్న అనుభవమంత వయస్సు లేదు. సాయంత్రమైతే చాలు జగన్ పబ్జీ ఆడుకుంటారు" అని యెద్దేవా చేశారు. 175 స్థానాలు గెలిచే విధంగా ప్రతి ఒక్కరూ పని చేయాలని పార్టీ నేతలకు అధినేత సూచించారు. పార్టీ కార్యక్రమాల విషయంలో అలక్ష్యం వద్దన్నారు. పని చేయలేని వారుంటే ఇప్పుడే తప్పుకోవాలని.. తాము ఆల్టరేటివ్ చూస్తామని స్పష్టం చేశారు. తాను ఇప్పుడు గట్టిగా మాట్లాటంలేదని అనుకోవద్దని.. పని చేయకుంటే గట్టిగానే యాక్షన్ తీసుకుంటానని చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.

# గుజరాత్, చత్తీస్‌గడ్‌లలో తిరుమల శ్రీవారి ఆలయాలు - వైవి సుబ్బారెడ్డి



తిరుపతి, జూన్ 19:ఒంటిమిట్టలో అన్నప్రసాద సముదాయ నిర్మాణం కోసం రూ.4 కోట్లు కేటాయించినట్లు టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి తెలిపారు. త్వరలో గుజరాత్ రాష్ట్రంలోని గాంధీనగర్, చత్తీస్ గడ్ లోని రాయపూర్ లో శ్రీవారి ఆలయ నిర్మాణాలు ప్రారంభిస్తామని పేర్కొన్నారు. సోమవారం ఉదయం తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలి సమావేశమైంది. ఈ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. పాలకమండలి నిర్ణయాలను టీటీడీ చైర్మన్ మీడియాకు తెలిపారు.మరోవైపు టీటీడీ పై కొంత మంది రాజకీయ ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. శ్రీవాణి ట్రస్ట్ ద్వారా వైసీపీ పార్టీ.. పాలకమండలి దోపిడి చేస్తున్నారని చేసిన ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. అంతేకాకుండా సనాతన హిందు ధర్మప్రచారంలో భాగంగా దేశవ్యాప్తంగా ఆలయాలు నిర్మించేందుకు శ్రీవాణి ట్రస్ట్ ఏర్పాటు చేసామని తెలిపారు. శ్రీవాణి ట్రస్ట్ కి వచ్చిన విరాళాలతో దేశవ్యాప్తంగా 2450 ఆలయాలు నిర్మిస్తున్నామని పేర్కొన్నారు. 275 పురాతన ఆలయాలను పున:రుద్దరణ చేస్తున్నామని.. శ్రీవాణి ట్రస్ట్ ద్వారా వచ్చిన విరాళాల వ్యయానికి సంబంధించిన వివరాలతో శ్వేతపత్రం విడుదల చేస్తామని వైవీ సుబ్బారెడ్డి తెలిపారు. శ్రీవాణి ట్రస్ట్ ద్వారా పారదర్శకంగా పనిచేస్తూ ఉంటే రాజకీయ లబ్దికోసం ఆరోపణలు చేస్తున్న వారి పై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

మరోవైపు తిరుమలలో భద్రతను కట్టుదిట్టం చేసేందుకు చర్యలు చేసుకుంటామని సుబ్బారెడ్డి తెలిపారు. తిరుమలపై తరుచు విమానాలు వెళ్ళడం పై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామన్నారు. అంతేకాకుండా కర్నూల్ జిల్లా యాగంటిలో కళ్యాణ మండపంలో నిర్మాణం కోసం రూ.2.4 కోట్లు కేటాయించినట్లు సుబ్బారెడ్డి పేర్కొన్నారు. తిరుమలలో 4.15కోట్లతో అదనపు లడ్డు కౌంటర్లు నిర్మాణం.. 2.35 కోట్లతో హెచ్ వీసి ప్రాంతంలో ఉన్న 144 గదులు ఆధునీకరణ చేస్తామన్నారు. రూ.1.88 కోట్లతో జీఎంసీ, ఎస్ఎంసి ఉప విచారణ కార్యాలయాలు ఆధునీకరణ చేయనున్నట్లు వైవీ సుబ్బారెడ్డి తెలిపారు.

### టీటీడీ పాలకమండలి నిర్ణయాలు.

పోలీస్ క్వార్టర్స్ నిర్మాణం కోసం రూ.3.5 కోట్లు

వేదిక్ యూనివర్శిటిలో స్టాఫ్ క్వార్టర్స్ నిర్మాణం కోసం రూ.5 కోట్లు

టీటీడీలో కంప్యూటర్ల ఆధునీకరణ కోసం రూ.7.4 కోట్లు

టీటీడీ పరిపాలన భవనంలో సెంట్రలైజ్డ్ రికార్డు సెంటర్ ఏర్పాటుకు రూ.9.4 కోట్లు

స్విమ్స్ హస్పిటల్స్ ఆధునీకరణ కోసం రూ.95 కోట్లు

తిరుమలలో ప్లాస్టిక్ బదులుగా స్టీల్ డస్ట్ బిన్స్ ఏర్పాటుకు రూ.3.1 కోట్లు

తిరుచానురు పద్మావతి అమ్మవారి పుష్కరిణిలో ఇత్తడి గ్రీల్స్ ఏర్పాటుకు రూ.6.5 కోట్లు

తిరుపతిలో రామానుజా సర్కిల్ నుంచి రేణిగుంట వైపు బిటి రోడ్డు నిర్మాణంకు రూ.5 కోట్లు

నగరి నియోజకవర్గం బుగ్గ గ్రామంలో కళ్యాణమండప నిర్మాణంకు రూ.2 కోట్లు

కర్నూల్ జిల్లా ఆవుకు గ్రామంలో ఆలయ నిర్మాణంకు రూ.4 కోట్లు కేటాయింపు

# ఎపిలో అర్బన్ హాస్పటల్స్‌కు మహార్ధశ - విప్లవాత్మక మార్పులకు జగన్ శ్రీకారం




అమరావతి, జూన్ 19:రాష్ట్రంలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు మహర్ధశ పట్టనుంది. వైద్య రంగంలో విప్లవాత్మక చర్యలకు శ్రీకారం చుట్టిన వైసీపీ సర్కార్ దశలవారీగా సంస్కరణలు చేపట్టింది. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సంపూర్ణ ఆరోగ్యం ప్రతి వ్యక్తి హక్కు అనే నినాదంతో రూ. 250 కోట్లతో యూపీహెచ్‌సీల ఏర్పాటు చేసింది. అందులో వైద్య సిబ్బంది నియా మకాలు చేపట్టింది. రాష్ట్రంలో అన్ని యూపీహెచ్‌సీ లపై ప్రత్యేక దృష్టి సారించి వైద్య పరీక్షల్ని పెంచ డంతో పాటు మందుల సంఖ్యను గణనీయంగా పెంచారు. వైద్య సిబ్బందిని పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంచడంతో యూపీహెచ్‌సీలు మెరుగైన పనితీరు కనబరుస్తున్నాయనే అభిప్రాయాలు రోగుల్లో వ్యక్తం అవుతున్నాయి. ఆసుపత్రులకు వచ్చే రోగులకు సకాలం లో వైద్య సేవలు అందించడంతో పాటు అన్ని రకాల పరీక్షలు, వసతులపై దృష్టిసారిస్తోంది. నేషనల్ క్యాలిటీ ఎస్యూరెన్స్ (ఎన్‌క్వాస్) విధానం ప్రకారం ఆసుపత్రుల్లో పూర్తిస్థాయిలో వైద్యులు, సిబ్బందితో పాటు వసతులు కల్పించాలన్నది ఈ నూతన విధానం లక్ష్యం. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఈ వి ధానం అమలవుతుండగా తాజాగా పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు (యూపీహెచ్‌సీ)ల్లో కూడా ఈ ఎన్‌క్వాస్ విధానం అమలుకు చర్యలు చేపడుతున్నారు.

### 12 అంశాలపై దృష్టి

పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో వసతులు మెరుగుపడటం ద్వారా రోగులకు సకాలంలో వైద్య సేవలు అందనున్నాయి. శానిటేషన్, రికార్డులు, ఐఈసీ మెటీరియల్, ఓపీ, ఐపీ, షీట్లు, ల్యాబ్, ఫార్మశీ జనర ల్ మెడిసిన్, వార్డుల్లో అందించే సేవలు, పరిపాలనా పరమైన మొత్తం 12 అంశాలపై ప్రధానంగా దృష్టి సారించనున్నారు. ప్రతి అంశంలో వంద మార్కుల్ని పరిగణన లోకి తీసుకుంటారు. 70 శాతం మార్కులు రావాల్సి ఉంటుంది. ఇలా అన్ని అంశాల్లో నూటికి 70 శాతం మార్కులు సాధించాల్సి ఉంటుంది. కేంద్ర కమిటీ ప్రతినిధులు ఆసుపత్రుల్ని తనిఖీ చేసి మార్కులు కేటాయిస్తారు. అన్ని పారామీటర్స్ పూర్తిస్థాయిలో ఉన్న ఆసుపత్రులకు నేషనల్ క్వాలిటీ విభాగం నుంచి సర్టిఫికెట్ అందించడంతో పాటు పట్టణ ఆరోగ్య కేంద్రానికి రూ.3 లక్షల చొప్పున నిధులు విడుదల చేయనున్నారు. రోగులకు అందించే వైద్య సేవలు, వైద్యుల పనితీరు, మందుల పంపిణీ వంటి అంశాలను పరిగణనలోకి తీసుకొని మార్కులు కేటాయించనున్నారు.

### మొదలైన ఆసుపత్రుల ఎంపిక

నేషనల్ క్వాలిటీ ఎస్యూరెన్స్ పథకానికి సంబంధించి పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ఎంపిక ప్రక్రియను జిల్లాస్థాయి ఆరోగ్యశాఖ అధికారులు ప్రారంభించారు. తొలి విడతలో జిల్లాకు 10 నుంచి 14 యూపీహెచ్‌సీలను గుర్తించి పూర్తిస్థాయిలో అన్ని వసతులు కల్పించే దిశగా చర్యలు చేపట్టనున్నారు. కేంద్ర క్వాలిటీ విభాగం పట్టణ ఆరోగ్య కేంద్రాలకు అందించే నిధుల్ని వినియోగించుకోవడం ద్వారా ఆయా ఆసుపత్రుల్లో వసతుల్ని మెరుగుపర్చడం ద్వారా మరింత మెరుగైన వైద్య సేవలు అందించే అవకాశం ఉంటుంది. ప్రతి పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఈ సర్టిఫికెట్ సాధించాలని లక్ష్యంగా నిర్ణయించి ఆ మేరకు కసరత్తు మొదలెట్టారు. ఇందులో భాగంగా యూపీహెచ్‌సీల్లోని వైద్యులు, సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఇచ్చేలా యాక్షన్ ప్లాన్ రూపొందించారు.

### చిరునవ్వుతో ఇంటికి వెళ్ళేలా

రోగి ఆస్పత్రికి వచ్చినప్పటి నుంచి ఇంటికి వెళ్లేవరకూ పూర్తి ఆరోగ్యంతో, సంతోషంతో, తాను మంచి సేవలు పొందానన్న సంతృప్తితో వెళ్లేలా చేసేలా ప్రభుత్వం ఆసుపత్రుల్ని తీర్చిదిద్దే ప్రయత్నం చేస్తోంది. ఇందులో భాగంగా పారిశుద్ధ్యం పై ప్రధానంగా దృష్టిసారించింది. పారిశుద్ధ్యం, పరిపాలన, ఆస్పత్రుల నిర్వహణ, ఇవన్నీ సరిగా అమలవుతున్నదీ, లేనిదీ పర్యవేక్షించేందుకు తనిఖీల సంఖ్య పెంచనుంది. తరచూ తనిఖీల ద్వారా ఆస్పత్రుల పనితీరును మెరుగుపర్చాలన్నది ప్రభుత్వం ఉద్దేశ్యం. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలోని 1145 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో 987 కేంద్రాల్లో రెన్నోవేషన్ పనుల్ని రూ.440 కోట్లు తో చేపట్టింది. ఎంఎల్‌హెచ్‌పీ నియామకాలు చేపట్టి గ్రామీణ స్థాయిలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తోంది. ఎన్‌క్వాస్ విధానాలకు అనుగుణంగా తాజాగా పట్టణ ఆరోగ్య కేంద్రాలకు మెరుగులుదిద్దనుంది.

# గత తొమ్మిదేళ్లలో భారతదేశం తన ప్రతిష్ట పెంచుకున్నందున ప్రపంచం ఇప్పుడు మనం చెప్పేది శ్రద్ధగా వింటుందని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్

న్యూఢిల్లీ, జూన్ 19:గత తొమ్మిదేళ్లలో అంతర్జాతీయ వేదికల లో భారతదేశ ప్రతిష్ట పెరిగిందని, ఇప్పుడు ప్రపంచం మనను శ్రద్ధగా వింటుందని రక్షణ మంత్రి శ్రీ రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. జూన్ 18, 2023న లక్నోలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో యుపిఎస్‌సి సివిల్ సర్వీసెస్ పరీక్షలో ఉత్తీర్ణులైన అభ్యర్థులను ఉద్దేశించి రక్షణ మంత్రి మాట్లాడుతూ, అభివృద్ధి చెందిన భారతదేశం అనే ఆలోచన ఇప్పుడు కేవలం కల కాదని, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఉత్సాహవంతమైన నాయకత్వంలో అది వాస్తవమవుతోందని ఉద్ఘాటించారు.

శ్రీ రాజ్‌నాథ్ సింగ్ ఇప్పుడు అమెరికా వంటి అగ్రరాజ్యం భారత ప్రధానిని స్వాగతించడానికి మరియు ఆతిథ్యం ఇవ్వడానికి శ్రద్ధగా సిద్ధమవుతోందని మరియు విదేశీ మీడియా దేశ విజయగాథ గురించి మాట్లాడుతుందని ఉద్ఘాటించారు.

2047 నాటికి అభివృద్ధి చెందిన భారతదేశం గురించి ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ దార్శనికత ను ప్రస్తావిస్తూ, అటువంటి దేశాన్ని నిర్మించడంలో యువ సివిల్ సర్వెంట్లది కీలక పాత్ర అని రక్షణ మంత్రి అన్నారు.

"మీ భుజాలపై ఒక పెద్ద బాధ్యత ఉంది. దేశం అమృత్ కాల్‌లోకి ప్రవేశించిన సమయంలో మీరు సేవ చేయబోతున్నారు. 2047 నాటికి మీరు మీ పదవీకాలం ముగుస్తున్నప్పుడు, దేశం స్వాతంత్ర్యం పొందిన 100వ సంవత్సరాన్ని జరుపుకుంటుంది. రాబోయే సవాళ్లకు మీరు సిద్ధంగా ఉండాలని నేను కోరుకుంటున్నాను. మనం కలిసి వాటిని ఎదుర్కొని భారతదేశాన్ని అభివృద్ధి చెందిన దేశ మార్గంలో తీసుకెళ్తాం" అని రక్షణ మంత్రి అన్నారు.

శ్రీ రాజ్‌నాథ్ సింగ్ సివిల్ సర్వెంట్లు ప్రజల అంచనాలు మరియు ఆకాంక్షలకు అనుగుణంగా సేవలందించడం ద్వారా మరియు వారితో చురుగ్గా పాల్గొనడం ద్వారా ప్రభుత్వంపై ప్రజల నమ్మకాన్ని సంపాదించాలని ఉద్బోధించారు. బ్యూరోక్రాట్లు ప్రజలతో మరింత సులభంగా సంబంధాలు నెరిపితే ప్రజాస్వామ్యంపై ప్రజలకు నమ్మకం చాలా రెట్లు పెరుగుతుందని ఆయన నొక్కి చెప్పారు.

సమాజం ప్రగతి, శ్రేయస్సు పథంలో ముందుకు సాగుతున్న కొద్దీ భూస్వామ్య వ్యవస్థ మనస్తత్వం క్షీణిస్తోందని, అలాంటి పరిస్థితుల్లో ప్రజల ఆకాంక్షలు, అభిలాషలకు అనుగుణంగా సేవలందించడమే వారి సామర్థ్యానికి కొలమానమని శ్రీ రాజ్‌నాథ్ సింగ్ నొక్కి చెప్పారు. "ఒకప్పుడు అధికార సంస్కృతి ఉండేది. పౌరులు విద్యావంతులు మరియు మరింత అవగాహన పొందుతున్నందున సేవ సమర్థత సంస్కృతి అధికార సంస్కృతిని అధిగమించింది, "అన్నారాయన.

దైనందిన పాలన, ప్రజాస్వామ్యంలో ప్రజాప్రతినిధుల పాత్రను నొక్కిచెప్పిన ఆయన, ప్రజాప్రతినిధుల వారి ఆకాంక్షలు సూచనలను అధికారులు సావధానంగా విని నడుచుకోవాలని, ప్రజాస్వామ్యంలో ఎన్నికైనప్రజా ప్రతినిధులే ప్రజలకు ప్రతినిధులని ఉద్ఘాటించారు.

రక్షణ మంత్రి స్థానిక పరిపాలనలో అనవసరమైన రాజకీయ జోక్యం యొక్క సంస్కృతిని ఖండించారు, అయినప్పటికీ, ప్రజాప్రతినిధులు దేశంలోని సాధారణ పౌరులకు ప్రాతినిధ్యం వహిస్తున్నందున వారి నుండి మార్గదర్శకత్వం అభిలషణీయం అన్నారు.

"ప్రజాప్రతినిధులుగా తమ నియోజకవర్గానికి సంబంధించిన సమస్యలను తప్పకుండా మీ ముందు లేవనెత్తారు. అందుకే మీ ప్రాంతంలోని ప్రజాప్రతినిధులతో కలిసి పని చేయాలి" అని ఉద్ఘాటించారు.

ఇటీవలి సంవత్సరాలలో సివిల్ సర్వీసెస్ పరీక్షలలో మహిళల అసాధారణ ప్రతిభను శ్రీ రాజ్‌నాథ్ సింగ్ ప్రశంసిస్తూ, మన బాలికలు మొదటి 3 స్థానాలను ఆక్రమిస్తున్నారు, ఈ పరీక్ష లో కూడ మొదటి 25 మందిలో 14 మంది బాలికలు సాధించడం ద్వారా భారతదేశం యొక్క కొత్త ముఖ చిత్రాన్ని ప్రదర్శిస్తున్నారు. మా కుమార్తెలు అవకాశం దొరికినప్పుడల్లా అవార్డులు తెచ్చారు అని ఆయన అన్నారు.

గాంధీజీ మంత్రమైన ధర్మకర్త తత్వాన్ని ప్రస్తావిస్తూ, రక్షణ మంత్రి యువ పౌర సేవకులను ప్రజల సంక్షేమం కోసం ఏదైనా నిర్ణయం తీసుకునేటప్పుడు సమాజంలోని చివరి వ్యక్తి గురించి ఆలోచించాలని కోరారు.

# చెట్టును ఢీకొన్న బైక్.. తల్లీకొడుకు మృతి

వరంగల్, జూన్ 19: ప్రమాదవశాత్తు బైక్ చెట్టును ఢీకొనడంతో తల్లీ కొడుకు మృతిచెందిన ఘటన పస్రా-తాడ్వాయి వద్ద చోటుచేసుకుంది. ఈరోజు మధ్యాహ్నం పస్రా తాడ్వాయి మధ్యలో మోటార్ సైకిల్ (బైక్) చెట్టుకు ఢీకొనడంతో కన్నాయి గూడెం మండలానికి చెందిన అంగన్వాడి టీచర్ సునర్కాని రమాదేవి, తన కుమారుడు ఇద్దరూ అక్కడికక్కడే మృతిచెందారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# అవును అవినీతి పెరిగిపోయింది..

## -కడియం శ్రీహరి కీలక వ్యాఖ్యలు..

జనగాం జూన్ 19 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);బీఆర్ఎస్ కీలక నేత, మాజీ మంత్రి కడియం శ్రీహరి కీలక వ్యాఖ్యలు చేశారు. ఆదివారం రాత్రి వీడియోతో తన నివాసంలో మాట్లాడిన ఆయన.. స్టేషన్ ఘన్‌పూర్‌లో అవినీతి పెరిగిందని కామెంట్స్ చేశారు. ఈ వ్యాఖ్యలతో ఒక్కసారిగా కడియం హాట్ టాపిక్ అయ్యారు. ' మీరిచ్చిన (ప్రజలు) ఖడ్గంతో ఆ అవినీతిని అంతమొం దిస్తాను. నిఖార్సైన, నిజాయితీ, మచ్చలేని నాయకుడిగా పేరు తెచ్చుకున్నా. గతంలో మంత్రిగా ఉ న్నప్పుడే ధర్మసాగర్, జాఫర్‌ఘడ్,స్టేషన్ ఘనపూర్‌లో తండాలకు రోడ్లు వేసుకున్నాం. ఇప్పటికీ అనేక తండాలలో రోడ్లు లేకపోతే, 11 కోట్లతో రోడ్లకు మంజూరు చేయించాను. రాబోయే రోజుల్లో నియోజవర్గంలోని ప్రతి తండాను అభివృద్ధి చేసే బాధ్యత నాదే అని హామీ ఇస్తున్నాను. మీ (ప్రజలు) ఆశీర్వాదం నాపై ఉండాలి. స్టేషన్ ఘనపూర్‌లో బంజారా భవన్‌తో పాటు, సేవాలాల్ భవన్ కూడా నిర్మిస్తాం. స్టేషన్ ఘనపూర్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరం ఉంది. ఆశీర్వదించి అవకాశం ఇచ్చినప్పుడు ప్రజల అభివృద్ధికి కృషి చేయాలి.. కానీ డబ్బులు దండుకోకూడదు. 10 సంవత్సరాలుగా అధికారంలో ఉన్న కాంగ్రెస్ తెలంగాణకు ఒరగబెట్టింది ఏమీలేదు. తెలంగాణపై కాంగ్రెస్, బీజేపీలు అక్కసు వెళ్లగక్కుతున్నారు. సన్నాసుల, దద్దమ్మల మాటలు విని మోసపోవద్దు' అని కడియం శ్రీహరి వ్యాఖ్యానించారు.

ఈ మాటల వెనుక..?

వాస్తవానికి కడియం శ్రీహరికి.. స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే రాజయ్యకు అస్సలు పడట్లేదు. ఈ ఇద్దరి మధ్య వచ్చగడ్డేస్తే భగ్గుమనేంతలా పరిస్థితులున్నాయి. ఇద్దరూ ఒకే పార్టీకి చెందిన వారైనప్పటికీ ఒకరిపై ఒకరు తీవ్ర వ్యాఖ్యలు చేసుకోవడం, సవాళు చేసుకోవడం సంచలనమైంది. అయితే ఇప్పుడు ఏకంగా.. స్టేషన్ ఘన్‌పూర్‌లో అవినీతి పెరిగిపోయిందని మీడియా ముందే వ్యాఖ్యానించడం గమనార్హం. అంతేకాదు.. ఈ ఎమ్మెల్యే అభివృద్ధి చేసిందేమీ లేదని.. తాను మంత్రిగా ఉన్నప్పుడు మాత్రమే అభివృద్ధి జరిగిందని పరోక్షంగా కడియం వ్యాఖ్యానించారు. తన హయాంలో ఏమేం అభివృద్ధి చేశానో కూడా చెప్పుకొచ్చారాయన. ఇవన్నీ ఒక ఎత్తయితే.. రాబోయే రోజుల్లో తనను ఆశీర్వదించాలని ప్రజలను కడియం రెక్వెస్ట్ చేయడం ఇవన్నీ చూస్తుంటే.. అసెంబ్లీ ఎన్నికల్లో ఈసారి రాజయ్యను కాదని.. కడియంకే టికెట్ ఇస్తారని స్పష్టంగా అర్థమవుతోంది. అయితే రాజయ్యపై లెక్కలేనన్ని ఆరోపణలు ఉ న్నాయన్న విషయం అందరికీ తెలిసిందే. అంతేకాదు.. ఆ మధ్య గులాబీ పార్టీకి గుడ్ బై చెప్పి.. వేరే పార్టీలోకి జంప్ అవుతారని కూడా వార్తలొచ్చాయి.

ఓహో ఇందుకేనా..?

ఇదిలా ఉంటే.. ఇప్పటికే సీఎం కేసీఆర్ 119 అసెంబ్లీ నియోజకవ ర్గాల్లో రహస్య సర్వేలు చేయించి మరీ ఎమ్మెల్యేల జాబితాను రెడీ చేశారని జాతీయ మీడియాలో కథనాలు వస్తున్నాయి. అన్నీ అనుకున్నట్లు జరిగితే జులై-15న 80 మంది అభ్యర్థులతో కూడిన తొలి జాబితాను రిలీజ్ చేయడానికి కేసీఆర్ సన్నాహాలు చేస్తున్నారని బీఆర్ఎస్ శ్రేణులు చెప్పుకుంటున్నాయి. అయితే మిగిలిన 39 స్థానాల్లో పొత్తులో సర్దుబాటు, కొందరు సిట్టింగ్‌లను మార్చడం లాంటివి జరుగుతాయని తెలుస్తోంది. కేసీఆర్ చేయించిన సర్వేలు 40-45 శాతం వరకూ మార్కులు పడిన సిట్టింగ్‌లో ఈసారి కూడా టికెట్ ఇవ్వడానికి కేసీఆర్ సిద్ధంగా ఉన్నారని విశ్వసనీయవర్గాల సమాచారం. పాస్ మార్కులు పడినప్పటికీ ఈసారి టికెట్ ఇచ్చే పరిస్థితే లేదని గులాబీ బాస్ తేల్చి చెప్పేయబోతున్నారట. బహుశా ఆ టికెట్ ఇవ్వని జాబితాలో రాజయ్య పేరు కూడా ఉందేమోనని.. అందుకే ఆ విషయం తెలుసుకున్న కడియం ఇలా కామెంట్స్ చేస్తున్నారని నియోజకవర్గంలో కార్యకర్తలు, అభిమానులు చెప్పుకుంటున్నారు.. ఫైనల్‌గా ఏం జరుగుతుందో చూడాలి మరి.

# తెలంగాణ విద్యా దినోత్సవం నేడే

సంగారెడ్డి, జూన్,19 (నేటి నిజం ప్రతినిధి): తెలంగాణ దశాబ్ది ఉ త్సవాల్లో భాగంగా మంగళవారం (జూన్, 20న) జిల్లా వ్యాప్తంగా విద్యా దినోత్సవాన్ని నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ శరత్ సోమవారం నాడు ఒక ప్రకటనలో తెలిపారు. విద్యా దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లాలో గల అన్ని విద్యాసంస్థల్లో ఉ దయం జాతీయ పతాక వందనం చేసి, తదనంతరం సభలో విద్యారం గంలో తెలంగాణ సాధించిన విజయాలను వివరిస్తారన్నారు. జిల్లాలో ప్రారంభానికి సిద్ధంగా ఉ న్న మన ఊరు మనబడి పాఠశాలలను ప్రారంభిస్తారని తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పుస్తకాలు, నోట్ బుక్స్, యూనిఫారాలు పంపిణీ చేస్తారని తెలిపారు. పాఠశాలల్లో విద్యార్థులకు రాగి జావా అందించే కార్యక్రమం లాంఛనంగా ప్రారంభి స్తారని తెలిపారు.

విద్యా దినోత్సవ వేడుకలలో విద్యార్థుల తల్లిదండ్రులు, ఆయా గ్రామ, పట్టణ ప్రజలు, ఎస్ఎంసి ప్రతినిధులు, పదవి విరమణ పొందిన ఉపాధ్యాయులు, ప్రజా ప్రతినిధులు, విద్యార్థులు, యువత పెద్ద ఎత్తున హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ కోరారు.

# తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలపై సర్వే..ఏ పార్టీకి ఎన్ని సీట్లు!

హైదరాబాద్ జూన్ 18 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపుపై ఎవరి ధీమా వారిదే.. హ్యాట్రిక్ కొట్టబోతున్నామని బీఆర్ఎస్ చెబుతుంటే.. మూడోసారి ఎలాగెలుస్తారో చూద్దామని కాంగ్రెస్ బీజేపీలో ఉన్నాయి.. కర్ణాటక తర్వాత తాము గెలవబోయేది తెలంగాణలోనే అని కాంగ్రెస్ చెప్పుకుంటోంది.. ఇదిగో రేపో, మాపో అధికారంలోకి వచ్చేస్తున్నామనేంతలా సీన్ క్రియేట్ చేసిన కమలనాథులు ఈ మధ్య ఎందుకో ఢీలా పడిపోయారు. అయితే.. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో ఏ పార్టీకి ఎన్ని సీట్లు వస్తాయి..? ఏ పార్టీకి ఎంత ఓటు శాతం వస్తుంది..? అని తాజాగా ఓ సర్వే జరిగింది.. ఆ సర్వే ప్రకారం ఏ పార్టీకి ఎన్నొస్తాయో టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి చిట్ చాట్‌లో భాగంగా చెప్పేశారు.

రేవంత్ చెప్పిన దాని ప్రకారం..

తాజా సర్వేల ప్రకారం తెలంగాణలో కాంగ్రెస్ ముందంజలో ఉందని రేవంత్‌రెడ్డి ధీమాగా చెప్పారు. మునుపటితో పోలిస్తే రాష్ట్రంలో కాంగ్రెస్ పుంజుకుందని స్పష్టం చేశారు. అయితే బీజేపీ 21 శాతం నుంచి దాదాపు07శాతం వరకు పడిపోయిందన్నారు. అయితే రేవంత్ వ్యక్తిగతంగా ఈ సర్వేలు చేయించారా..? పార్టీ తరఫున చేయించారా..? అనే విషయాలను చెప్పలేదు.

### సీట్లు ఇలా.. :-

బీఆర్ఎస్ : 45 స్థానాలు
కాంగ్రెస్ : 45 స్థానాలు
బీజేపీ : 7 స్థానాలు
ఎంఐఎం : 7 సీట్లు వస్తాయని 15 సీట్లలో ప్రత్యర్థితో కాంగ్రెస్‌కు గట్టిపోటీ ఉంటుందని రేవంత్ జోస్యం చెప్పారు.

ఓట్ల శాతం ఇలా.. :-
బీఆర్ఎస్ : 37 శాతం
కాంగ్రెస్ :35 శాతం
బీజేపీ : 14 శాతం
ఎంఐఎం : 03 శాతం

పది పథకాల వైఫల్యాలను..!

శనివారం నాడు గాంధీభవన్‌లో జరిగిన రాజకీయ వ్యవహారాల కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా దశాబ్ది ఉత్సవాలు, కాంగ్రెస్ మండల కమిటీలు, బీసీ డిక్లరేషన్, మహిళా, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ డిక్లరేషన్‌పై చర్చ జరిగింది. పొలిటికల్ ఎఫైర్స్ కమిటీ కన్వీనర్‌గా షబ్బీర్ అలీ బాధ్యత వహిస్తారని రేవంత్ ప్రకటించారు. పది వైఫల్యాలతో రావణాసురుడి పది తలలకు.. పది పథకాల వైఫల్యాలను పెట్టి ప్రజల్లోకి తీసుకెళ్తామన్నారు. కేజీ టూ పీజీ విద్య, ఫీజు రీయంబర్స్‌మెంట్, నిరుద్యోగ భృతి, ఇంటికో ఉద్యోగం, డబుల్ బెడ్ రూం ఇల్లు, పోడు భూముల పట్టాలు, మూడు ఎకరాల భూమి, మైనార్టీలకు 12 శాతం రిజర్వేషన్లు, ఎస్టీ రిజర్వేషన్లు అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్తామని రేవంత్ చెప్పుకొచ్చారు. అదే విధంగా పాదాల మీద చేసేది పాదయాత్ర కాబట్టి సీఎల్పీ నాయకుడు భట్టీ విక్రమార్క పాదయాత్ర చేస్తున్నారన్నారు. ఈనెలాఖరుతో పాదయాత్ర ముగుస్తుండటంతో ఖమ్మంలో జాతీయ నాయకులతో భారీ ముగింపు సభ నిర్వహించాలని ఆలోచన చేస్తున్నట్లు రేవంత్ వెల్లడించారు.

రెండో రాజధాని అంశంపై..!

'కేసీఆర్ మోసాలకు అమరుల ఆత్మలు ఘోషిస్తున్నాయి. ఉద్యమకారులంటే కేసీఆర్‌కు అసూయ. ఉద్యమం జరిగేటప్పుడు కేటీఆర్ ఎక్కడున్నాడు..?. కేసీఆర్‌ను ముఖ్యమంత్రి చేస్తానని బండి సంజయ్ ఇండైరెక్ట్‌గా చెబుతున్నారు. హైదరబాద్ రెండవ రాజదాని విషయంలో పార్టీలో చర్చించి నిర్ణయం తీసుకుంటాం. హైదరాబాద్ రెండవ రాజధాని అంశం అషామాషి కాదు. హైదరాబాద్ రెండవ రాజధాని అయితే ఆదాయం కేంద్రానికి పోతుందా? రాష్ట్రానికి పోతుందా?. హైదరాబాద్ రెండవ రాజధాని అయి ఆదాయం కేంద్రానికి వెళ్తే తెలంగాణ చేతిలో చిప్ప మిగులుతుంది' అని రేవంత్ చెప్పుకొచ్చారు.

### పీఏసీ మీటింగ్‌లో కీలక నిర్ణయాలు..

- ప్రస్తుతం ఉన్న కాంగ్రెస్ పాజిటివ్ వేవ్‌ను కొనసాగించేందుకు వరుస కార్యక్రమాలు చేయాలి
- బీఆర్ఎస్ ప్రభుత్వ 21 రోజుల దశాబ్ది ఉత్సవాలకు చివరి రోజు గట్టి కౌంటర్ ఇవ్వాలి
- బీఆర్ఎస్ వైఫల్యాలపై గ్రామ, మండల స్థాయిలో కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు రేవంత్ రెడ్డి మీడియాకు వెల్లడించారు.

# రూ.కోటి అవార్డు సొమ్ము నిరాకరించిన గీతాప్రెస్

న్యూఢిల్లీ జూన్ 19 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: జాతిపిత మహాత్మాగాంధీ పేరిట ఏటా అందజేసే గాంధీ శాంతి పురస్కారానికి 2021 సంవత్సరానికి గోరఖ్‌పూర్‌లోని ప్రఖ్యాత గీతాప్రెస్‌ను కేంద్ర ప్రభుత్వం ఎంపిక చేయడంపై ఓ వైపు హర్షాతిరేకాలు వ్యక్తమవుతుండగా, మరోవైపు వివాదం చోటుచేసుకోవడంపై గీతాప్రెస్ స్పందించింది. ఈ అవార్డు కింద ఇచ్చే కోటి రూపాయల అవార్డును నిరాకరిస్తున్నట్టు తెలిపింది. జ్ఞాపికను మాత్రమే తాము స్వీకరిస్తామని, అవార్డు సొమ్మును వేరే అవసరాలకు ప్రభుత్వం ఉపయోగించుకోవచ్చని గీతాప్రెస్ పబ్లిషర్స్ తెలిపారు.అహింస, గాంధేయ పద్ధతుల్లో సామాజిక ఆర్థిక, రాజకీయ పరివర్తన కోసం చేసిన విశేష కృషికి గీతాప్రెస్ ప్రచురణ సంస్థను గాంధీ శాంతి పురస్కారానికి ఎంపిక చేసినట్టు కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వ శాఖ ఆదివారంనాడు ప్రకటించింది. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సారథ్యంలోని జ్యూరీ ఈ పురస్కారానికి గీతాప్రెస్‌ను ఎంపిక చేసింది. గీతాప్రెస్ స్థాపించి వందేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంలో ఈ పురస్కారానికి ఎంపిక కావడం సామాజిక సేవలో ఆ సంస్థ చేసిన కృషికి గుర్తింపు అని ప్రధాని మోదీ ఓ ట్వీట్‌లో గీతాప్రెస్‌కు అభినందనలు తెలిపాయి.

### కాంగ్రెస్ విమర్శ...

కాగా, గీతాప్రెస్‌ను గాంధీకి శాంతి బహుమతికి ఎంపిక చేయడంపై కాంగ్రెస్ పార్టీ విమర్శలు గుప్పించింది. గీతాప్రెస్‌ను ఎంపిక చేయడం సావర్కర్, గాడ్సేను ఎంపిక చేసిన తరహాలో ఉందని, ఇదొక అవహాస్యమైన నిర్ణయంగా అభివర్ణించింది.

గీతాప్రెస్ ఆర్థిక ఇబ్బందులు..!

1923లో ప్రారంభమైన గీతాప్రెస్ ప్రపంచంలోనే అతిపెద్ద ప్రచురణ సంస్థల్లో ఒకటిగా నిలిచింది. 14 బాషల్లో 41.7 కోట్లకు పైగా పుస్తకాలను ప్రచురించిన రికార్డు సొంతం చేసుకుంది. వీటిలో 16.21 కోట్లు భగవద్గీత పుస్తకాలే ఉన్నాయి. లాభాపేక్ష కోసం కానీ, ఆదాయం కోసం అడ్వర్‌టైజ్‌మెంట్లను ఆశ్రయించడం కానీ ఏనాడూ చేయని సంస్థగా పేరుతెచ్చుకుంది. కొద్ది కాలం క్రితం ఆర్థిక భారం కారణంగా గీతాప్రెస్ మూతబడనుందనే వార్తలు వచ్చాయి. గీతాప్రెస్ సేవలు అమూల్యమని, అది మూతపడకుండా కేంద్రం ఆదుకోవాలంటూ విజ్ఞప్తులు కూడా వచ్చాయి. ఈ క్రమంలో తమ గీతాప్రెస్ మూతపడటం లేదంటూ ఆ సంస్థ ప్రకటించింది. ఈ క్రమంలో గాంధీ శాంతి బహుమతి ద్వారా వచ్చే రూ.కోటి రూపాయలు సంస్థ పురోగతికి ఊతం అవుతుందనే అభిప్రాయాలు తాజాగా వ్యక్తమయ్యాయి. అయితే, అవార్డుకు గీతాప్రెస్‌ను ఎంపిక చేయడం వివాదానికి దారితీయడంతో గీతాప్రెస్ ప్రబ్లిషర్స్ మరోసారి ముందుకు వచ్చారు. కోటి రూపాయల పురస్కారాన్ని సున్నితంగా నిరాకరిస్తున్నట్టు ప్రకటించారు. జ్ఞాపికను తీసుకుంటామని, అవార్డు సొమ్ము కేంద్రం వేరే కార్యక్రమాలకు ఉపయోగించుకోవచ్చని ప్రకటించడం ప్రాధాన్యత సంతరించుకుంది.

# గుర్బానీపై చట్ట సవరణకు సీఎం సమాయత్తం.. ఎస్జీపీసీ వార్నింగ్..!

చండిఘర్ జూన్ 19 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: స్వర్ణ దేవాలయానికి చెందిన గుర్బానీ అంశం పంజాబ్‌లో ఒక్కసారిగా రాజకీయ వేడి రగల్చింది. సిక్కు గురుద్వారా చట్టానికి కొత్తగా క్లాజ్ తీసుకువస్తున్నామని, ఇందువల్ల స్వర్ణదేవాలయానికి చెందిన గుర్బానీ అందరికీ ఉచితంగా అందుబాటులోకి వస్తుందని పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ సింగ్ మాన్ చేసిన ప్రకటన ఈ వివాదానికి కారణమైంది.

సీఎం ప్రకటనపై శిరోమణి గురుద్వార ప్రబంధక్ కమిటీ తీవ్ర ఆక్షేపణ వ్యక్తం చేసింది. ఇది ఎస్‌జీపీసీకి చెందిన అంశమని, దీనిని రాజకీయం చేస్తే సహించేది లేదని హెచ్చరించింది.

# ఏమిటీ వివాదం-ఎవరి వాదన ఏమిటి?

హైదరాబాద్, జూన్ 19:గుర్బానీ అంటే పంజాబీలకు పవిత్రమైన శ్లోకం అని అర్థం. హర్మిందర్ సాహిబ్ (స్వర్ణదేవాలయం) నుంచి దీన్ని ప్రతిరోజూ ప్రసారం చేస్తుంటారు. ఇంతవరకూ సిక్కుల 'ఎపెక్స్ బాడీ' అయిన ఎస్‌జీపీసీకి ఈ గుర్బానీ ప్రసార హక్కులు ఉన్నారు. బాదల్ కుటుంబానికి చెందిన పీటీసీ నెట్‌వర్క్‌కు గుర్బానీ ప్రసార హక్కులు గతంలో కట్టబెట్టారు. తాజాగా గుర్బానీని అందరికీ అందుబాటులో ఉండేలా ఉచితంగా ప్రసారం చేస్తామని ముఖ్యమంత్రి ప్రకటించారు.

ఇందుకు అనుగుణంగా గురుద్వారా-1925 చట్టాన్ని సవరిస్తామని, సవరణ బిల్లును ఈనెల 20వ తేదీన అసెంబ్లీలో ప్రవేశపెడతామని ఓ ట్వీట్‌లో ప్రకటించారు. చాలాకాలంగా భక్తుల నుంచి వస్తున్న డిమాండ్లకు అనుగుణంగా సిక్కు గురుద్వారా చట్టానికి కొత్త క్లాజ్ చేర్చడం ద్వారా, అందరికీ గుర్బానీ ఉచితంగా అందుబాటులోకి వస్తుందని ప్రకటించారు. కాగా, ఈ చట్టం అమల్లోకి వస్తే పీటీసీ ఏకఛత్రాధిపత్యానికి తెరపడుతుంది. అన్ని టెలివిజన్ ఛానెళ్లు గుర్బానీని ఉచితంగా ప్రసారం చేసుకునేందుకు మార్గం సుగమం అవుతుంది.

### ఎస్‌జీపీపీ నుంచి తీవ్ర వ్యతిరేకత...

కాగా, సీఎం నిర్ణయంపై ఎస్‌జీపీసీ అధ్యక్షుడు హర్జిందర్ సింగ్ ధామ్ మండిపడ్డారు. సిక్కు గురుద్వారా చట్టం-1925లో చాలా స్పష్టంగా రాజకీయ జోక్యం కుదరదని చెప్పడం జరిగిందన్నారు. ఢిల్లీలో కూర్చున్న పెద్దల మెప్పుకోసం మతానికి రాజకీయ రంగు పులుముతున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీషియన్‌కు ముందే దీనిపై ఎస్‌జీపీసీ డ్రాఫ్టింగ్ జరిపిందని, దానిని సవరించరాదని స్పష్టం చేశారు. కాగా, గుర్బానీపై చట్ట సవరణకు ఎస్‌పీజీసీ ఓవైపు నిరసన వ్యక్తం చేస్తుండగా, సీఎం మాన్ మాత్రం ఈనెల 20న చట్ట సవరణ బిల్లును అసెంబ్లీలో ప్రవేశపెట్టేందుకు సిద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలో గుర్బానీ చుట్టూ తలెత్తిన వివాదం ఎలాంటి కీలక మలుపులు తిరగనుందనేది ఆసక్తికరంగా మారింది.

# హరిత ప్రదాత సీఎం కేసీఆర్-ఎమ్మెల్యే అరూరి



వరంగల్, జూన్ 19:తెలంగాణ రాష్ట్రంలో అటవీ శాతాన్ని పెంచాలనే ఉద్దేశ్యంతో ముఖ్యమంత్రి కేసీఆర్ గారు హరితహారం కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని బిఆర్ఎస్ పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షులు, వర్దన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ తెలిపారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉ త్సవాలలో భాగంగా వర్దన్నపేట మండలం కట్ర్యాల లో నిర్వహించిన హరితోత్సవంలో ఎమ్మెల్యే అరూరి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమ పథకాలే కాదు పర్యావరణ సమతుల్యతను కాపాడటంతో పాటు భవిష్యత్ తరాలకు ఆహ్లాదకరమైన వాతావణాన్ని అందించాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి కేసీఆర్ హరితహారం కార్యక్రమానికి రూపకల్పన చేశారని తెలిపారు. వాతావరణ సమతుల్యత ఉండాలంటే 33శాతం అడవులు ఉ ండటం ఒక్కటే మార్గమని నమ్మిన కేసీఆర్ హరిత హారం కార్యక్రమాన్ని ఒక ఉద్యమంలా ముందుకు తీసుకువెళ్లారని అన్నారు. ఇందులో ప్రభుత్వ అధికారులు, ప్రజలు, పార్టీ ప్రతినిధులు ప్రతీ ఒక్కరి భాగస్వామ్యంతో నేడు తెలంగాణ పచ్చదనంతో ఫరడవిల్లుతోందని పేర్కొన్నారు. పట్టణాలు, గ్రామాలలో నర్సరీలు ఏర్పాటు చేసి ఒక ప్రణాళికతో మొక్కలు నాటి వాటిని సంరక్షిస్తున్నట్లు వెల్లడించారు. ప్రతీ గ్రామంలో ప్రకృతి వనాలు ఏర్పాటుతో పాటు అనువైన చోటల్లా విరివిగా మొక్కలు నాటుతున్నట్లు తెలిపారు. దీంతో తాజాగా ఫారెస్ట్ సర్వే ఆఫ్ ఇండియా నివేదికలో తెలంగాణకు హరితహారం కార్యక్రమం ఫలితంగా రాష్ట్రంలో 7.70 శాతం పెరిగిందని వివరించారు. రాష్ట్రంలో చేపట్టిన ప్రభుత్వ సంకల్పానికి ప్రజల సహకారం తోడవడంతో తెలంగాణకు హరితహారం కార్యక్రమం దిగ్విజయంగా ముందుకు సాగుతోందని తెలిపారు.

# మెదక్ జిల్లా ఆసుపత్రి నందు వికలాంగులను గుర్తించి అర్హత గల వారికి సదరం ధ్రువీకరణ పత్రం

మెదక్, జూన్ 19:(నేటినిజం ప్రతినిధి): మెదక్ జిల్లా ఆసుపత్రి నందు వికలాంగులను గుర్తించి అర్హత గల వారికి సదరం ధ్రువీకరణ పత్రం ఇచ్చుటకు జూన్ మాసానికి సంబంధించి శిబిరం తేదీలను మీ సేవ/ ఈ సి కేంద్రాలకు కేటాయించామని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. హాజరు కాగోరు దివ్యంగులు సమీపంలోని మీ సేవ/ ఈ సేవ కేంద్రం నందు ఆన్ లైన్ లో స్లాట్ బుక్ చేసుకొని రసీదులో కేటాయింపబడిన రోజు ఉదయం 9 గంటల నుడి మధ్యాన్నం 12 గంటల వరకు మెదక్ జిల్లా ఆసుపత్రి నందు హాజరు కావలసినదిగా ఆయన సూచించారు.వచ్చేటప్పుడు మీ సేవ రసీదు, ఫోటో ఆధార్ జిరాక్స్, సంబంధిత మెడికల్ రిపోర్ట్స్ తీసుకురావాలని సూచించారు. ఆన్ లైన్ లో నమోదు కానీ వారు సదరం క్యాం కు హాజరు కావలసిన అవసరం లేదని స్పష్టం చేశారు.

# అశోక చక్రవర్తి తర్వాత మొక్కలు నాటించడం, చెరువులు తవ్వకం అనే బృహత్కర కార్యక్రమాలను రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ చేపటారు



ముఖ్యమంత్రి సిద్ధిపేట లో ఒకే రోజు 10 వేల మొక్కలు నాటి పచ్చదనానికి ఇస్తున్న ప్రాముఖ్యతను వివరించారన్నారు. అడవుల చుట్టూ కంచె, ట్రెంచ్ లు ఏర్పాటు చేసి పరిరక్షిస్తున్నారని, జిల్లా అటవీ అధికారులకు, కలెక్టర్లకు పూర్తి అధికారాలిచ్చి పరిరక్షణకు కృషి చేస్తున్నారన్నారు. ప్రతి పల్లెకు ట్రాక్టర్, ట్రాలీ,టాంకర్ ఇచ్చి 85 శాతం మొక్కలు బ్రతికేలా బాధ్యత పెట్టారని తద్వారా పచ్చదనం పెంపొందిందని అన్నారు. నేడు నాటిన మొక్కలు భవిష్యత్తు తరాలు ఆరోగ్యవంతంగా జీవించడానికి దోహదపడతాయని, కాబట్టి ప్రతి ఒక్కరు యుద్ధ ప్రాతిపదికన మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. జిల్లా కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ ముఖ్యమంత్రి విజన్, దార్శనికత, అటవీ శాఖ సాంకేతిక మార్గదర్శకాల మేరకు సూక్ష్మ ప్రణాళిక తో పనిచేయడం, ప్రజాప్రతినిధులు, అధికారులు సమిష్టి భాగస్వామ్యం వల్ల రాష్ట్రంలో పచ్చదనాన్ని పెంపొందించుకున్నా మన్నారు. ఇప్పటి వరకు 8 విడతలుగా హరితా హారం కార్యక్రమం నిర్వహించుకున్నామని, ఈ 9వ విడత కార్యక్రమంలో కూడా ప్రతి ఒక్కరు భాగస్వాములై ప్రతి ఇంటా 6 మొక్కలు పెంచి, అన్ని బ్రతికేలా చూడాలన్నారు.అనంతరం విద్యార్థులతో కలిసి ఎమ్మెల్యే పద్మ దేవేందర్ రెడ్డి డాన్స్ చేశారు... ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులకు నిర్వహించిన పోటీలలో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ జానకి రామ్ సాగర్,జిల్లా అధికారులు శ్రీనివాస్, రాధాకిషన్, రాజిరెడ్డి, శంకర్, విజయశేఖర్ రెడ్డి, విజయ లక్ష్మి, సుధాకర్, మెప్మా పిడి ఇందిర, డిసిఓ కరుణ, వ్యవసాయాధికారి ఆశాకుమారి, ఎంపిపి యమున, కోఅప్షన్ సభ్యులు మన్సూర్, కౌన్సిలర్లు, విద్యార్థినిలు , అటవీ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మెదక్, జూన్ 19:(నేటినిజం ప్రతినిధి):అశోక చక్రవర్తి తర్వాత మొక్కలు నాటించడం, చెరువులు తవ్వకం అనే బృహత్కర కార్యక్రమాలను రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ చేపట్టాడని మెదక్ ఎమ్మెల్యే పద్మ దేవేందర్ రెడ్డి అన్నారు.రాష్ట్రావతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం నూతన కలెక్టరేట్ సముదాయంలో చేపట్టిన హరితోత్సవ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా కమిషన్ చైర్పర్సన్ సునీత లక్ష్మారెడ్డి, నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్ రెడ్డి, జిల్లా కలెక్టర్ రాజర్షి షా, అదనపు కలెక్టర్ ప్రతిమ సింగ్, జిల్లా అటవీ శాఖాధికారి రవి ప్రసాద్, మునిసిపల్ చైర్మన్ చంద్రపాల్, మార్కెట్ కమిటీ చైర్మన్ బట్టి జగపతి తదితరులతో కలిసి పెద్ద ఎత్తున మాస్ ప్లాంటేషన్ లో పాల్గొని మొక్కలు నాటి నీళ్లు పోశారు. ఈ సందర్భంగా అటవీ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సమావేశం లో ఆ శాఖముద్రించిన హరితహారం విజయాలు గోడ పత్రికను ఆవిష్కరించారు. అనంతరం ఎమ్మెల్యే పద్మ దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ మానవ మనుగడకు ప్రాణం పోసేది మొక్కలని, మొక్కలు నాటడం కూడా అభివృద్ధిలో భాగమని ప్రగతికి సోపానమని అన్నారు. రోజు రోజు కాలుష్యం పెరుగుతుందని, పర్యావరణ సమతుల్యానికి మొక్కలు పెంచకపోతే రాబోవు కాలంలో ఆక్సిజన్ దొరకక ఆక్సిజన్ సిలిండర్లు పెట్టుకునే స్థాయి వస్తున్నదని అన్నారు. అభివృద్ధి చెందిన దేశాలను చూసుకున్నట్లయితే ఒక మనిషికి ఆక్సిజన్ తీసుకోవడానికి 30 చెట్లు ఉంటే మన దగ్గర 30 మందికి ఒక చెట్టు కూడా లేదన్నారు.భవిష్యత్తు తరాలు హాయిగా, ఆరోగ్యంగా జీవించడానికే రాష్ట్ర ముఖ్యమంత్రి పెద్ద ఎత్తున హరిత హారం కార్యక్రమం చేపట్టి 8 విడతలలో రాష్ట్రంలో 273 కోట్ల మొక్కలు పెంచడంతో పాటు, గ్రీన్ బడ్జెట్ క్రింది 10 శాతం నిధులు ఖర్చు పెడుతున్న రని , అడవుల పునర్జీవనానికి కృషిచేస్తుండడం వల్ల నేడు 7.7 శాతం పచ్చదనం పెంపొందిందని ఇది దేశ చరిత్రలో రికార్డ్ అని అన్నారు. ప్రతి గ్రామ పంచాయతీలో నర్సరీలు, పల్లె ప్రకృతి వనాలు బృహత్ పల్లె ప్రకృతి వనాలతో పాటు అర్బన్ పార్కులు, ఏవెన్యూ ప్లాంటేషన్ మొక్కలు నాటే కార్యక్రమాలు చేపట్టమన్నారు..రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ సునీత లక్ష్మా రెడ్డి మాట్లాడుతూ భూభాగంలో 33 శాతం ఉండవలసిన అడవులు పలు కారణాల రీత్యా క్షీణించగా రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రణాళికాబద్ధంగా హరితా హారం కార్యక్రమం చేపట్టి , 85 శాతం మొక్కలు బ్రతికేలా అధికారులు, ప్రజాప్రతినిధులకు బాద్యులను చేశారన్నారు. తద్వారా నేడు 7.7 శాతం పచ్చదనాన్ని పెంచి హరిత విప్లవం సాధించాం అన్నారు. మానవాళికి జీవనాధారమైన చెట్లను మనం రక్షిస్తే అవి మనకు నీడను, స్వచ్ఛమైన గాలి, పూలు, పండ్లు, ఔషధాలు ఇస్తూ రక్షిస్తాయాని అన్నారు. పలచబడ్డ అడవులను పునర్జీవం చేయడం ద్వారా నేడు వన్యప్రాణులకు కాపాడుకోగలు గుతున్నామని అన్నారు.నర్సాపూర్ శాసనసభ్యులు మదన్ రెడ్డి మాట్లాడుతూ గతంలో

# పచ్చదనంతో పాటు ఫలసాయంతో సంపద పెంచాలి

మెదక్, జూన్ 19:(నేటినిజం ప్రతినిధి):పచ్చదనంతో పాటు ఫలసాయంతో సంపద పెంచాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం 9వ విడత హరిత హారంలో సంపద వనాల పేరిట నీటిపారుదల భూముల్లో మొక్కల పెంపకాన్ని చేపట్టనున్నామని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. రాష్ట్రావతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా సోమవారం నర్సాపూర్ మండలం రెడ్డిపల్లి లో ని మూడు ఎకరల నీటిపారుదల భూముల్లో మొక్కలు నాటి సంపద వనాల కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రతిమ సింగ్, నీటిపారుదల ఎస్ ఈ యేసయ్య, ఈ ఈ శ్రీనివాస్ రావు, డిఆర్ డిఓ శ్రీనివాస్, జిల్లా అటవీ అధికారి రవి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో కలెక్టర్ మాట్లాడుతూ ఫలసాయంతో పాటు కలప ను ఇచ్చే మొక్కలు నాటి గ్రామ పంచాయతీలకు ఆదాయం సమకూర్చాలని తలంపుతో జిల్లాలో సంపద వనాలు ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. ఎలాంటి వివాదాలు లేని 3 ఎకరాల నుండి 30 ఎకరాల పైగా ఎఫ్.టి.ఎల్. ఉన్న నీటిపారుదల ఉన్న చెరువులు, కాలువల ప్రాంతాలను వంద ఎకరాలకు పైగా గుర్తించామని వర్షాలు ప్రారంభమయ్యాక ఇట్టి సంపద వనాలను చేపడతామని అన్నారు.నీటిపారుదల శాఖ పరిధిలో జరిపే బ్లాక్ ప్లాంటేషన్ సంపద వనాలుగా అభివృద్ధి చేయడం జరుగుతుందని, మూడేళ్ళ పాటు నిర్వహణ బాధ్యత తీసుకోవడం జరుగుతుందని కాబట్టి ఇట్టి కార్యక్రమం విజయవంతం చేసి ఆదర్శ జిల్లాగా నిలుపుటలో కృషి చేయాలని కోరారు. హైదరాబాద్ కు చేరువలో మెదక్ జిల్లా ఉందని, రాష్ట్ర చీఫ్ సెక్రెటరీ ఉన్నతాధికారులు జిల్లాను సందర్శించే అవకాశముంటుందని, కాబట్టి హరిత హారం, సంపద వనాలు కార్యక్రమం పకడ్బందీగా చేపట్టాలన్నారు. జిల్లాలోని ప్రతి గ్రామా పంచాయతీలో నర్సరీలు, పల్లె ప్రకృతి వనాలు, బృహత్ ప్రకృతి వనాలను ఏర్పాటు చేశామని, గ్రామాంలో పోటీతత్వం పెరిగి పచ్చదనం పెంపునకు ఎంతో కృషి చేస్తున్నారన్నారు. ప్రతి గ్రామ పంచాయతీకి ట్రాక్టర్ ట్రాలీ, టాంకర్ అందించామని, తద్వారా మొక్కలకు నీటిని అందిస్తుండడం ద్వారా 85 శాతం పైగా మొక్కలు జీవిస్తున్నాయన్నారు. హరితహారం క్రింద నాటేందుకు అవసరమైన మొక్కలను మనమే తయారు చేసుకునే దిశగా ప్రతి గ్రామంలో, మున్సిపాలిటీలో నర్సరీలను ఏర్పాటు చేశామని, నాటిన మొక్కలను సంరక్షించే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, అన్నారు. ప్రజల భాగస్వామ్యంతో హరితహారం ద్వారా పచ్చదనం గణనీయంగా పెరిగిందని, ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులో సైతం మొక్కలు పెంచడానికి, వాటి సంరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఒక విజన్ తో చేపట్టిన హరితహారం కార్యక్రమం రాష్ట్రంలో అద్భుత ఫలితాలు సాధించిందని 8 విడతలలో 273 కోట్ల మొక్కలు నాటగా 95 శాతం మొక్కలు మనుగడ సాగిస్తున్నాయని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్, పంచాయతి కార్యదర్శి, ఎపిఓ, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.




